నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 20-9-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక:40 పేజీలు: 4 వెల: రూ.1/-

జాతీయ విద్యావిధానంలో ఓ మైలురాయి

21వ శతాబ్దపు లక్ష్యాలను అందుకునేలా ఉంది నూతన ఎడ్యుకేషన్ పాలసీపై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

న్యూఢిల్లీ,సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ): 21వ శతాబ్దపు లక్ష్యాలను అందుకునే విధంగా కొత్త జాతీయ విద్యావిధానం రూపుదిద్దుకుందని, ఇది మొత్తం విద్యావ్యవస్థను మార్చివేస్తుందని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అన్నారు. జాతీయ విద్యా విధానంపై రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తన అభిప్రాయాలను వెల్లడించారు. ఎన్ఈపీ 2020.. ఉన్నత విద్య అంశంపై జరిగిన విజిటర్స్ కాన్ఫరెన్స్ సదస్సులో ఆయన వర్చువల్ సందేశం ఇచ్చారు. నాణ్యమైన విద్యను అందిస్తూ సమాన, ఉత్తేజపూరిత సమాజాన్ని స్థాపించేందుకు ఎన్ఈపీ పనిచేస్తుందన్నారు. మార్క్‌లు, గ్రేడ్లు, పాత బోధనా విధానాలను నిరుత్సహపరిచేందుకు కొత్త ఎన్ఈపీ ఉపయోగపడుతుందని రాష్ట్రపతి కోవింద్ తెలిపారు. ఎన్ఈపీతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందన్నారు. ప్రాచీన కాలంలో విద్యా క్షేత్రంగా భారత్‌కు ప్రపంచ వ్యాప్తంగా పేరుందన్నారు. తక్షశిల, నలంద వర్సిటీలకు ప్రత్యేక గుర్తింపు ఉన్నదన్నారు. కానీ నేటి ఉన్నత విద్యా సంస్థలకు మాత్రం గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో మంచి పొజిషన్ రావడం లేదన్నారు. ఎన్ఈపీ ద్వారా బోధనకు భారత్ మళ్లీ కేంద్రంగా మారుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. 2035 లోగా ఉన్నత విద్యలో ఎన్‌రోల్మెంట్‌ను 50 శాతానికి పెంచాలని ఎన్ఈపీ టార్గెట్‌లో ఉందన్నారు. టెక్నాలజీతో ఈ టార్గెట్ సాధ్యమే అని ఆయన తెలిపారు.

కాల్పుల ఉల్లంఘనలో పాక్ రికార్డు

3,186 సార్లు పాక్ సైన్యం కాల్పులు: కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ,సెప్టెంబర్19((ఆర్ఎన్ఎ): కాల్పుల విరమణ ఒప్పందానికి పాకిస్తాన్ తూట్లు పొడుస్తూనే ఉంది. పదేపదే కవ్వింపు చర్యలకు పాల్పడుతూ.. భారత సైనిక శిబిరాలను లక్ష్యంగా చేసుకుని పాక్ కాల్పులకు పాల్పడుతోంది. ఇరు దేశాల సరిహద్దులో ఉన్న ఎల్‌వోసీ వెంబడి.. ఈ ఏడాది జనవరి 1 నుంచి సెప్టెంబర్ 7వ తేదీ వరకు 3,186 సార్లు పాక్ సైన్యం కాల్పులు జరిపినట్లు కేంద్రం పార్లమెంట్ వేదికగా ఇటీవలే వెల్లడించింది. 2003లో కాల్పుల విరమణ ఒప్పందం జరిగిన తర్వాత.. అంటే ఈ 17 ఏళ్లలో అత్యధికంగా కాల్పులకు పాల్పడింది ఈ ఏడాదే అని కేంద్రం స్పష్టం చేసింది. పాకిస్తాన్ సైన్యం కాల్పులకు తెగబడడంతో ఈ ఏడాది 8 మంది ఆర్మీ జవాన్లు ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వందలాది మంది అమాయక ప్రజలు కూడా పాక్ కాల్పుల్లో గాయపడ్డారు. వీరిలో మహిళలు, చిన్నారులు కూడా ఉన్నారు. అమాయకపు చిన్నారులు, మహిళలు కూడా పాక్ కాల్పులకు బలయ్యారు. చాలా ఇండ్లు, భవనాలు దెబ్బతిన్నాయి. ఈ ఏడాది జూన్ వరకు 2,432 సార్లు పాకిస్తాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. 2019 ఏడాదిలో 2 వేల సార్లు పాక్ సైన్యం కాల్పులకు పాల్పడింది. ఇక శుక్రవారం సాయంత్రం గురేజ్ సెక్టార్ వద్ద పాకిస్తాన్ బలగాలు కాల్పులకు పాల్పడడంతో.. ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. పాక్ కాల్పులను భారత సైన్యం సమర్థవంతంగా తిప్పికొట్టింది.

తేనెపూసిన కత్తిలా కేంద్ర వ్యవసాయ బిల్లు

రైతులను నట్టేట ముంచేలా ఉందని మండిపడ్డ కెసిఆర్ కార్పోరేట్ గద్దలకు దోచిపెట్టేలా వీలు కల్పించారు రాజ్యసభలో వ్యతిరేకించండని ఎంపిలకు కెసిఆర్ ఆదేశం

హైదరాబాద్,సెప్టెంబర్19 (ఆంఎన్ఎ): కేంద్రం ప్రవేశపెట్టిన కొత్త వ్యవసాయ బిల్లు తేనె పూసిన కత్తిలా ఉందని సీఎం కేసీఆర్ అభివర్ణించారు. బిల్లు రైతులకు అన్యాయం చేసేలా ఉందని ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతుల ప్రయోజనాలను దెబ్బకొట్టి కార్పొరేటు వ్యాపారులకు లబ్ది చేకూర్చేలా ఉందన్నారు. రాజ్యసభలో బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయాలని తెరాస ఎంపీలను ఆదేశించారు. దేశం ఆర్థిక సంక్షోభంలో ఉంటే కేంద్రం రైతుల జీవితాలతో చెలగాటమాడుతోందని మండిపడ్డారు. రైతులు పండించే కొద్దిపాటి పంటను ఇతర ప్రాంతాలకు తరలించి అమ్ముకునేందుకు అవకాశమే లేదని, దేశంలో చిన్నసన్నకారు రైతులే అధికమని గుర్తు చేశారు. వాస్తవానికి రైతులు ఎక్కడికైనా వెళ్లి పంట అమ్ము కోవచ్చని బిల్లులో చెప్పారు. కానీ వ్యాపారులు ఎక్కడికైనా వెళ్లి సరుకులు కొనుగోలు చేసుకునేలా ఉంది. కార్పొరేట్ గద్దలు దేశమంతా విస్తరించేలా అవకాశం కల్పిస్తున్న ఈ బిల్లును తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకిస్తుందని సీఎం అన్నారు. ప్రస్తుతం మక్కల దిగుమతిపై 50శాతం పన్ను అమలులో ఉంది. పన్నును 15 శాతానికి తగ్గించి దిగుమతి చేసుకోవాలని కేంద్రం భావిస్తోంది. ఇలా చేస్తే తెలంగాణ రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందని చెప్పారు. మన దేశంలోనే మక్కలు పుష్కలంగా పండుతోంటే సుంకం తగ్గించి దిగుమతి చేసుకోవాల్సి అవసరమేంటని ఆయన ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయ బిల్లు రైతు లోకానికి తీవ్ర అన్యాయం చేసే విధంగా ఉందన్నారు. నిజానికి రైతులు తమకున్న కొద్దిపాటు సరుకును ఎన్నో రవాణా ఖర్చులు భరించి లారీల ద్వారా వేరే చోటుకు తీసుకెళ్లి అమ్మడం సాధ్యమేనా? ఇది తేనె పూసిన కత్తిలాంటి చట్టం. దీన్ని ఖచ్చితంగా వ్యతిరేకించి తీరాలన్నారు. ప్రస్తుతం మక్కల దిగుమతిపై 50 శాతం సుంకం అమలులో ఉంది. దీనిని 15 శాతానికి తగ్గించి కోటి టన్నుల మక్కలు దిగుమతి చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే 70-75 లక్షల టన్నులను కొనుగోలు చేసింది. 35 శాతం సుంకం తగ్గియడం ఎవరి ప్రయోజనం ఆశించి చేసింది. దేశం ఆర్థిక సంక్షోభంలో ఉండే సమయంలో ఈ నిర్ణయం ఎలా తీసుకున్నారని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రశ్నించారు. వ్యవసాయ బిల్లు అమలులోకి వస్తే రైతుల పరిస్థితి దారుణంగా ఉంటుందని వ్యాఖ్యానించారు. మరోవైపు కేంద్ర మాజీ మంత్రి, శిరోమణీ అకాలీదళ్ ఎంపీ హర్‌సిమ్రత్ కౌర్ కూడా ఈ వ్యవసాయ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే ఆమె కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసినట్లు సమాచారం.

ఆరోగ్యం విషయంలో జాగ్రత్త వహించండి : ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ,సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారి కొనసాగుతున్న నేపథ్యంలో సాధారణ ప్రజలు, పార్లమెంట్ సభ్యులు ఆరోగ్య సంరక్షణ విషయంలో తీసుకోవలసిన జాగ్రత్తలను రాజ్యసభ చైర్మన్ ఎం వెంకయ్య నాయుడు పునరుద్ఘాటించారు. ఈ మహమ్మారి విషయంలో పార్లమెంట్ తీసుకుంటున్న చర్యలు, ఏర్పాటు చేసిన సౌకర్యాలను పునరుద్ఘాటించిన వెంకయ్య నాయుడు.. రాపిడ్ యాంటిజెన్, ఆర్టీ-పీసీఆర్ రెండు పరీక్షా సౌకర్యాలు పార్లమెంట్ లోని రిసెప్షన్ కార్యాలయంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం గం. 2.30 నిముషాల వరకూ, అదేవిధంగా పార్లమెంట్ అనెక్సీలో ఉదయం గం.10-30 నిముషాల నుంచి సాయంత్రం 5 గంటలకు వరకూ అందుబాటులో ఉంటాయని తెలిపారు. సభ్యులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలన్నారు.

ఇవేగాక గణనీయమైన సంఖ్యలో ఆక్సిమీటర్లు, ఆక్సిజన్ సహిత ప్రథమ చికిత్స పార్లమెంట్ తో పాటు పార్లమెంట్ అనెక్సీ వైద్య కేంద్రం వద్ద లభిస్తాయని తెలిపారు. సభ్యుల భద్రత కోసం ఐసీఎంఆర్, ఆరోగ్య మంత్రిత్వ శాఖ, హోం మంత్రిత్వ శాఖ నిర్దేశిరచిన నియమ నిబంధనలు పాటించే విషయంలో సభ్యులందరూ సహకరించాలని కోరిన ఆయన, సమయం కొరత దృష్ట్యా అర్థవంతంగా వినియోగించుకోవాలని, సభా కార్యకలాపాలు సజావుగా సాగేలా చూడాలని గౌరవ సభ్యులకు సూచించారు. కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యల గురించి హోం శాఖ కార్యదర్శి, ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి, ఐసీఎంఆర్ ప్రధాన సంచాలకులు , రాజ్యసభ సచివాలయ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించినట్లు సభ్యులకు తెలియజేశారు. ఈ మహమ్మారితో పోరాడటంలో భాగంగా సభ్యులు తీసుకోవలసిన నాలుగు కీలకమైన చర్యలను వెంకయ్య నాయుడు ప్రధానంగా ప్రస్తావించారు. బయటి వారిని కలిసేటప్పుడు మాస్క్ ధరించడం అత్యంత ఆవశ్యకమని సూచించారు. మీ దగ్గర పని చేసేవారు సైతం బయట నుంచి వచ్చి విధులను నిర్వహిస్తుంటే వారు కూడా మాస్క్ తప్పనిసరిగా ధరించడం అత్యంత ఆవశ్యకమని తెలిపారు. అలాగే, సురక్షితమైన దూరాన్ని పాటించడం రెండో అతిముఖ్యమైన జాగ్రత్త అని తెలిపిన ఆయన, ఈ మహమ్మారి దూరమయ్యే వరకూ సురక్షిత దూరం విషయంలో రాజీపడొద్దని సూచించారు. మూడో జాగ్రత్తగా వ్యక్తిగత పరిశుభ్రతను ప్రస్తావించి, చేతులను ఎప్పటికప్పుడు సబ్బుతో శుభ్రపరచుకోవడం వల్ల ఇతర ఇన్‌ఫెక్షన్లు రాకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. కొవిడ్ మహమ్మారిని ఎదుర్కొనేందుకు ముఖ్యంగా రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవాలని, మంచి పోషకాలున్న బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకోవడమే కాకుండా రోజూ నడక వంటి కనీస వ్యాయామాలైనా తప్పనిసరిగా చేయాలని సూచించారు.

తెలంగాణలో కొత్తగా మరో 2,123 కరోనా కేసులు

హైదరాబాద్,సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ): తెలంగాణలో కొత్తగా మరో 2,123 కరోనా కేసులు నమోదయ్యాయి. కరోనా వైరస్ వల్ల 9 మంది మృతి చెందారు. శనివారం ఉదయం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కరోనా బులిటెన్ విడుదల చేసింది. రాష్ట్రంలో కరోనా వైరస్ పాజిటివ్ కేసుల సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతుంది. రాష్ట్రంలో ఇప్పటి వరకు నమోదైన కేసుల సంఖ్య 1,69,169 చేరాయని బులిటెన్‌లో తెలిపింది. మొత్తం 1,37,508 మంది డిశ్చార్జ్ కాగా, రాష్ట్రంలో కరోనాతో ఇప్పటివరకు 1,025మంది చెందారు. ప్రస్తుతం రాష్ట్రంలో 30,636 యాక్టివ్ కేసులు ఉన్నాయి. జీహెచ్ఎంసీ పరిధిలో 305 కేసులు కాగా, ఇక జిల్లాల వారీగా చూసినట్లయితే.. రంగారెడ్డి 185, మేడ్చల్ 149, నల్గొండ 135, కరీంనగర్‌లో 112 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.

పట్టభద్ర ఓటరు నమోదుపై టిఆర్ఎస్ దృష్టి

-కెటిఆర్ ఆదేశాలతో నేతల పరుగులు

హైదరాబాద్,సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ): రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని టిఆర్ఎస్ నిర్ణయించింది. ఈ మేరకు ఎక్కడికక్కడ ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు తమ పరిధిలో సమాచార సేకరణలో పడ్డారు. గ్రాడ్యుయేట్ల వివరాలను సేకరిస్తున్నారు. ఈ మేరకు నగరంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజులు పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తున్నారు. టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.

వరుసగా రెండురోజులుగా కార్పొరేటర్లల, కౌన్సిలర్లు, ముఖ్యనాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ తమ స్థానిక ప్రాంతాల్లో పర్యటించి ఓటరు నమోదు కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో చేపట్టాలన్నారు. పట్టభద్రులైన వారిని గుర్తించి ఓటరుగా నమోదు చేయించాలన్నారు. పార్టీ అధిష్ఠానం బలపరిచిన అభ్యర్థుల విజయం కోసం సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని, అభివృద్ధి, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న టీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో పూర్తి నమ్మకం ఉందని, వారి ఆశీర్వాదం తప్పక ఉంటుందన్నారు. కార్యక్రమంలో మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాలాలు పొంగితే ప్రాణాలు పోవాల్సిందేనా!

ఇదేనా అంతర్జాతీయ నగరం చేస్తామన్న వాగ్దానం నేరేడ్‌మెట్ బాలిక దుర్మరణంపై విజయశాంతి ఆవేదన

హైదరాబాద్,సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ): నగరంలోని మల్కాజిగిరిలో సుమేధ అనే అమ్మాయి నాలాలో కొట్టుకు పోవడంతో చోటుచేసుకున్నవిషాద ఘటనపై తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్‌పర్సన్ విజయశాంతి ఫేస్‌బుక్ వేదికగా స్పందిస్తూ కేసీఆర్ సర్కార్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బయటికి వెళ్లిన బాలిక నాలాలో పడి రెండు కి.మీ. దూరంలో శవమై తేలింది. ఈ ఘటన ప్రతి ఒక్కర్నీ కలచివేసింది.

'కేసీఆర్ గారూ... మీ సర్కారు నిర్లక్ష్యానికి ఇంకెన్ని ప్రాణాలు బలైపోవాలో చెప్పండి. సికింద్రాబాద్‌లో వర్షాలకు పొంగిపొర్లిన దీనదయాళ్‌నగర్ ఓపెన్ నాలాలో సుమేధ అనే 12 ఏళ్ళ విద్యార్థిని జీవితం కరిగిపోయింది. విశ్వనగరం చేస్తామంటూ మీరు చెప్పుకుంటున్న జంటనగరాల్లో వర్షాలు పడినప్పుడల్లా నాలాలు, డ్రైనేజీలు, మ్యాన్ హోల్స్ కనిపించనంతగా నీరు నిండిపోయి ఎన్ని ప్రాణాలు బలైపోయాయో లెక్క తీస్తే ఒక గిన్నిస్ రికార్డు అవుతుంది. ఇలాంటి ఘోరాలు జరిగినప్పుడల్లా మీ పార్టీ నేతలు రావడం... ఇలా జరక్కుండా చూస్తామని హామీలిచ్చి వెళ్ళిపోవడం మామూలైపోయింది. వర్షాలు పడినప్పుడల్లా హైదరాబాదులోని పలు ప్రాంతాలు నీట మునిగిపోవడం పాత ప్రభుత్వాల పుణ్యమేనని గతంలో మీరు ఎన్నోసార్లు విమర్శించారు. మరి గడిచిన ఆరేళ్ళ కాలంలో మీ ప్రభుత్వం చేసిందేంటి? ఇప్పుడు రాష్ట్రంలోని పలు ఇతర పట్టణాలు, నగరాలు హైదరాబాదు నగరానికి తోడవుతున్నాయి. అడుగడుగునా కబ్జాలు, అక్రమ కట్టడాలతో ఆ ప్రాంతాలు కూడా చినుకు పడితే చాలు మునిగిపోయే పరిస్థితి నెలకొంది. ప్రజల ఆగ్రహ వెల్లువలో మీరూ కొట్టుకపోకముందే మేలుకుని పరిస్థితిని చక్కదిద్దండని ఆమె హితవు పలికారు.

కరోనా పేషెంట్లను దోచుకుంటున్న ప్రైవేట్ ఆస్పత్రులు

రాజ్యసభలో ఆందోళన వ్యక్తం చేసిన టిఆర్ఎస్ ఎంపి కెకె

న్యూఢిల్లీ,సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ): కరోనా వేళ ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీకి అడ్డూ అదుపులేకుండా పోయిందని టీఆర్ఎస్ ఎంపీ కేశవరావు మండిపడ్డారు. ప్రైవేట్ ఆస్పత్రులు దోపిడీ కేంద్రాలుగా మారాయని రాజ్యసభలో చర్చ సందర్భంగా ప్రస్తావించారు. అంటు వ్యాధుల సవరణ బిల్లుపై రాజ్యసభలో చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో టీఆర్ఎస్ ఎంపీ కేశవరావు మాట్లాడారు. హైదరాబాద్‌లో ఓ హాస్పిటల్ ఓ రోగి నుంచి 90 లక్షల బిల్లును చార్జ్ చేసిందన్నారు. అలాంటి హాస్పిటళ్ల నుంచి రక్షణ కల్పించాలన్నారు. కోవిడ్ ఉధృతి వేళ తాను ఓ హాస్పిటల్‌కు వెళ్లినప్పుడు.. అక్కడ శవాలు గుట్టలుగా ఉన్నట్లు ఆయన తెలిపారు. ఇలాంటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక విధానం రూపొందించాలన్నారు. కేంద్రమైనా, లేక రాష్ట్రమైనా కేర్ తీసుకునే విధంగా చట్టాన్ని తయారు చేయాలన్నారు. లాక్‌డౌన్ సమయంలో ఇతర రాష్ట్రాల నుంచి కూలీలు వలస వెళ్తుంటే మీరు వారిని అడ్డుకున్నారని, రైళ్లను ఆపేశారని,ఇంటర్ స్టేట్ బస్సులను నడపకుండా చేశారన్నారు. ఇలాంటి సమయాల్లో రాష్ట్రాల ప్రమేయంతో నిర్ణయాలు తీసుకోవాలని, ఆయా రాష్ట్రాలకు సహకరించాలని కేశవరావు కేంద్రానికి సూచించారు. అంతకముందు కేంద్ర మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ అంటువ్యాధుల సవరణ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. 1897లో మాండవీలో ప్లేగు రావడంలో అప్పటి బ్రిటీశ్ ప్రభుత్వం అంటువ్యాధుల చట్టాన్ని రూపొందించిందన్నారు. కరోనా వైరస్ కొత్త వైరస్ అని, దానికి గురించి పూర్తిగా తెలియకపోవడంతో మొదట్లో హెల్త్‌కేర్ వర్కర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు చెప్పారు.

హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం

జలమయం అయిన లోతట్టు ప్రాంతాలు నీట మునిగిన రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి

హైదరాబాద్,సెప్టెంబర్19 (ఆర్ఎన్ఎ): హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఎల్బీనగర్, వనస్థలీపురం, హయత్ నగర్, అబ్దుల్లాపూర్ మేట్, దిల్ సుఖ్ నగర్, చైతన్యపురి, సరూర్ నగర్, కర్మన్‌ఘాట్, కొత్తపేట్, మీర్‌పేట్, కీసర, జవహర్‌నగర్, దమ్మాయిగూడ, నాగారం, నేరేడ్‌మెట్ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అనేకచోట్ల ఈదురు గాలులకు చెట్లు పడిపోయాయి. పలుప్రాంతాల్లో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ట్రాఫిక్ స్తంభించిపోయింది. వాగులు, వంకలు, నాలాలు పొంగి పొర్లుతున్నాయి. పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొద్ది రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం.. మరోసారి భాగ్యనగరాన్ని ముంచెత్తింది. శనివారం మధ్యాహ్నం నగరంలో భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. నాలాలు పొంగిపొర్లాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో జీహెచ్ఎంసీ అప్రమత్తమైంది. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ.. తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు జీహెచ్ఎంసీ ఆదేశాలు జారీ చేస్తోంది. డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ బృందాలు పలు ప్రాంతాల్లో సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. అలాగే ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వరదలు పోటెత్తాయి. భారీ వర్షాలు, వరదలకు జిల్లాలోని వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. శంకర్‌పల్లికి సమీపంలోని మూసీవాగు, తీగల వాగు పొంగి పొర్లుతున్నాయి. దీంతో వరద నీరు శంకర్‌పల్లి పట్టణంలోకి భారీగా చేరింది. పట్టణమంతా నదిని తలపిస్తోంది. ఇళ్లలోకి నీరు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. నిత్యావసరాలు తెచ్చుకునేందుకు కూడా బయటకు వెళ్లే పరిస్థితి లేదు. కొందరి నివాసాల్లో బియ్యంతో పాటు ఇతర వస్తువులు తడిసి ముద్ద అయ్యాయి. గత నాలుగైదు రోజుల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే.

అంబులెన్స్‌లను ప్రారంభించిన మంత్రి కేటీఆర్

హైదరాబాద్,సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ): ప్రగతి భవన్ వద్ద ఐటీ, పురపాలిక శాఖ మంత్రి కేటీఆర్ శనివారం మరో పది అంబులెన్స్‌లను ప్రారంభించారు. కేటీఆర్ ఇచ్చిన గిఫ్ట్ ఏ స్మైల్ పిలుపు మేరకు టీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఈ అంబులెన్స్‌లను అందజేశారు. సంక్షేమశాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్ ఓ అంబులెన్స్‌ను సమకూర్చారు. ఎంపీ రంజిత్‌రెడ్డి, మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి రెండు అంబులెన్స్‌లను ఇచ్చారు. ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, మహేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, గువ్వల బాలరాజు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అంబులెన్స్‌లను అందజేశారు. గత నెల 8న కేటీర్ జన్మదినం సందర్భంగా గిఫ్ట్ ఏ స్మైల్ పేరుతో ప్రభుత్వానికి పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు అంబులెన్స్‌లను అందజేశారు. మంత్రులు శ్రీనివాస్ గౌడ్, మల్లారెడ్డి, ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, ఎంపీశ్రీనివాస్‌రెడ్డి, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వేమిరెడ్డి నరసింహారెడ్డి 9 అంబులెన్స్‌లను అందజేసిన విషయం తెలిసిందే.

కరోనా నియంత్రణలో తెలంగాణ చర్యలు భేష్

-సిఎస్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో కేంద్ర కార్యదర్శుల వెల్లడి

హైదరాబాద్,సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ): కరోనా మహమ్మారి వ్యాప్తి నివారణలో అదేవిధంగా జాతీయ సగటుతో పోల్చితే తక్కువ మరణాల శాతం నమోదు కావడంపట్ల కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబా తెలంగాణ ప్రభుత్వానికి అభినందనలు తెలియజేశారు.

వన్నెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పియూష్ గోయల్, క్యాబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబా శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైరస్ వ్యాప్తి నివారణలో వివిధ రాష్ట్రాలు తీసుకున్న చర్యల గురించి కేంద్ర మంత్రి, క్యాబినెట్ కార్యదర్శి ఆరా తీశారు. రాష్ట్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల్లో పెద్ద ఎత్తున కోవిడ్ పరీక్షలను నిర్వహించడంపట్ల క్యాబినెట్ కార్యదర్శి ప్రశంసించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్ మాట్లాడుతూ.. కరోనా వైరస్‌ను ఎదుర్కొవటానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితులను ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోందన్నారు. టెస్టుల సంఖ్యను గణనీయంగా పెంచినట్లు తెలిపారు. లక్షణాలు ఉండి ర్యాపిడ్ యాంటిజెన్ టెస్ట్‌లో నెగెటివ్ వచ్చిన వారికి ఆర్‌టీపీసీఆర్ పరీక్షలు చేస్తున్నట్లు వెల్లడించారు. అన్ని పడకలను ఆక్సిజన్ సదుపాయాలతో సిద్ధం చేసేందుకు ప్రభుత్వం వ్యూహాన్ని రూపొందించిందన్నారు. జిల్లాల్లో కోవిడ్ పరిస్థితుల నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఆరోగ్య కార్యదర్శి రిజ్వి, డైరెక్టర్ డ్రగ్స్ కంట్రోల్ డాక్టర్ ప్రీతి మీనా, ఇతర ఆరోగ్య అధికారులు పాల్గొన్నారు.

చరిత్రలో నేటినిజం

ఏటేటా ఉల్లి ధరల పోటు

నేటినిజం
ఆదివారం 20-9-2020

ఉల్లి పంటను ప్రోత్సహించడం..నిల్వ చేయడంలో కేంద్రంతో పాటు రాష్ట్రాలు కూడా విఫలమవుతూనే ఉన్నాయి. గతేడాది ఉల్లి కష్టాలు వచ్చినప్పుడు హడావిడి చేసిన ప్రభుత్వాలు మళ్లీ యధావిధిగా మారడంతో ఈ యేడు కూడా ఉల్లి ధరలు అమాంతంగా పెరిగి పోతున్నాయి. సామాన్యుడు కష్టపడితే మాకేంటన్న ధోరణిలో ప్రభుత్వాలు ఉన్నాయి. దేశంలో సామాన్యుల నుండి అత్యంత ధనికుల వరకు ఉల్లిపాయలను నిత్యం ఆహారంలో వినియోగిస్తారు. ఉల్లి లేకుండా వంట చేసుకోవడం కష్టంగా మారిన ఈ రోజుల్లో ఈ పంటలపై పెద్దగా దృష్టి పెట్టడం లేదు. రైతులు ధైర్యం చేసి పంటలు పండిస్తే గిట్టుబాటు ధరలు రాక ఆందోళన చెందాల్సిందే. రైతులకు, ప్రజలకు వారి మానాన వారిని వదిలేసేలా విధానాలు అవలంబించడం ప్రభుత్వాలకు అలవాటుగా మారింది. ఉల్లి ధరలను అదుపులో ఉంచటం అవసరమే అయినా అందుకు వ్యూహాలను మాత్రం అమలు చేయడం లేదు. కేంద్ర ప్రభుత్వం ఈ నెల 14 నుండి ఉల్లిపాయల ఎగుమతులను నిషేధించటంతో... ఉల్లిపాయలను ఉత్పత్తి చేస్తున్న రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్న వాదనా ఉంది. ఎగుమతులు నిషేధిస్తే ప్రజలకు అందుబాటులో ఉంటాయని కేంద్రం ఆలోచనగా ఉంది. కాని ఎగుమతులను నిషేధిస్తున్న ప్రభుత్వం వినియోగదారులకు తక్కువ ధరలకు సరఫరా చేస్తామని ఎక్కడా చెప్పలేదు. కాబట్టి ధరల పెరుగుదల పేరుతో ఎగుమతులను నిషేధించటం రైతులు తీవ్రంగా నష్టపోవటానికి, బడా వ్యాపారులు కోట్ల రూపాయల లాభాలను అక్రమంగా సంపాదించుకోవటానికి దారితీస్తుంది. కాని వినియోగదారులకు మాత్రం తక్కువ ధరలకు ఉల్లిపాయలు దొరుకుతాయన్న గ్యారెంటీ మాత్రం లేదు. ప్రభుత్వం తీసుకొనే చర్యలు రైతాంగానికి మద్దతు ధరలు దక్కే విధంగా, ప్రజలకు సరసమైన ధరలకు ఉల్లిపాయలు అందే విధంగా ఉండాలి. ఉల్లికి మద్దతు ధరలను ప్రకటించి, ఆ ధరల కన్నా తగ్గించి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నపుడు ప్రభుత్వమే మార్కెట్ లోకి వచ్చి కొనుగోలు చేయాలి. ప్రభుత్వం కొనుగోలు చేసిన మద్దతు ధరలకు, వినియోగదారులకు సరఫరా చేస్తున్న ధరలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని సబ్సిడీ ఇవ్వటం ద్వారా ప్రభుత్వం భర్తీ చేయాలి. సరుకు వ్యాపారుల చేతుల్లోకి చేరిన తర్వాత ధరలను విపరీతంగా పెంచి, వినియోగదారులను దోపిడి చేస్తున్నారు. మరోవైపు నూతనవ్యవసాయ విధానంవల్ల కూడా రైతులకు నష్టమే తప్ప లాభం లేదంటున్నారు. పంటలు బాగా పండి, దేశ ప్రజలకు సరిపోనూ ఉత్పత్తి అయిన సంవత్సరాలలో కూడా ముందుగానే రైతుల నుండి పంటను కొని, నిల్వ చేసుకోవడంలో వ్యాపారులు ముందుంటారు. మార్కెట్‌లో కృత్రిమ కొరతను సృష్టించి, అత్యధిక ధరలకు వినియోగ దారులకు అమ్మి అత్యధిక లాభాలను సంపాదించుకోవటానికి ఈ విధానం దోహదం చేస్తుంది. ఇటువంటి పరిస్థితులలో ఎగుమతులపై కూడా నిషేధాన్ని విధిస్తే దేశంలోని రైతాంగానికి శాపంగా, బడా వ్యాపారులకు వరంగా మారుతుందన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. అయితే ఇక్కడ ఎగుమతులపై ఆంక్షలు లేకుంటే ధరలకు మరింత రెక్కలు వస్తాయన్నది ప్రభుత్వ వాదనగా ఉంది. ఎగుమతులకు అనుమతిస్తే ధరలు పెరిగి, వినియోగదారులకు నష్టం జరుగుతుందని ప్రభుత్వం వాదిస్తోంది. దేశంలో 2.2 కోట్ల టన్నుల ఉల్లిపాయలు ఉత్పత్తి అవుతున్నాయి. ఉల్లిపాయల ఉత్పత్తిలో దేశంలో మహారాష్ట్ర మొదటి స్థానంలో, మధ్యప్రదేశ్ రెండు, కర్ణాటక మూడవ స్థానంలో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ ఆరవ స్థానంలో ఉన్నది. ఉల్లిపాయల కొరతతో 2015లో వ్యాపారులు ధరలను విపరీతంగా పెంచారు. కిలో 10 రూపాయలకు అమ్ముతున్న ఉల్లిపాయలు ఏకంగా 100 రూపాయలకు మించి అమ్మారు. కొరతను అధిగమించటం కోసం ప్రభుత్వం ఇతర దేశాల నుండి, ముఖ్యంగా పాకిస్థాన్ నుండి దిగుమతి చేసుకోవటం, కొన్ని రాష్ట్రాలు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేయటం ద్వారా ధరలను అరికట్టటానికి ప్రయత్నించాయి. అయినప్పటికీ ధరల ఒడిదుడుకులు, వినియోగదారులు, ఉత్పత్తిదారులను దోపిడి చేయటంలో ఏ మాత్రం మార్పు రాలేదు. ప్రపంచంలో వినియోగించే కూరగాయలలో ఉల్లిపాయలు మూడవ స్థానంలో ఉన్నాయి. ఉల్లిపాయల ఉత్పత్తిలో చైనా మొదటి స్థానంలో, భారతదేశం రెండవ స్థానంలో ఉంది. ప్రపంచంలో 70 శాతానికి పైగా ఉల్లిపాయలు ఎనిమిది దేశాలలోనే ఉత్పత్తి అవుతున్నాయి. మంచిరకం విత్తనాల ధరలు విపరీతంగా పెరగటం, తెగుళ్ళు ఎక్కువగా రావటం, ఎరువులు, పురుగుమందుల ధరలు పెరగటం, సాగునీటి సదుపాయం లేకపోవటం, అధిక, అత్యల్ప వర్షాలు, రవాణా ఛార్జీల భారం, పండిన పంటను సక్రమంగా నిల్వ చేయకపోవటం, కార్పొరేట్, బడా వ్యాపారులు ధరలను అదుపు చేయటం వలన ధరలలో అధిక హెచ్చుతగ్గులు తదితర కారణాల వలన రైతులు నష్టపోతున్నారు. పంట దిగుబడులలో దిగువ స్థానంలో ఉండటంతో రైతులు అంతర్జాతీయ మార్కెట్‌లో కూడా పోటి పడలేకపోతున్నారు. భారతదేశం సంవత్సరానికి 15 లక్షల టన్నుల వరకు ఉల్లిపాయలను ఎగుమతి చేస్తున్నది. సంవత్సరం రెండు కోట్ల టన్నులకు పైగా ఉల్లిపాయలు ఉత్పత్తి కావచ్చునని అంచనా వేస్తున్నారు. ఉత్పత్తి అయిన ఉల్లిపాయలను ఎక్కువ మంది రైతులు పంట చేతికి రాగానే అమ్ముకుంటారు. ముఖ్యంగా కౌలురైతులు పంటను అమ్ముకోకుండా ఉండలేరు. అక్టోబరులో ఖరీఫ్ పంట చేతికి వస్తుంది. ఇటువంటి పరిస్థితులలో ప్రభుత్వం ఎగుమతులను నిషేధిస్తూ ప్రకటన చేయటం రైతాంగం కనీసధరలను పొందటాన్ని కూడా నిరోధిస్తుంది. ఉల్లిపాయల పంట మార్కెట్ లోకి వస్తున్న తరుణంలో వ్యాపారులు ధరలను పూర్తిగా తగ్గిస్తున్నారు. ఏటా పంట మార్కెట్ లోకి వచ్చినపుడు రైతాంగానికి గిట్టుబాటు ధర రావటం లేదు. ఫలితంగా రైతాంగానికి పంట ఉత్పత్తి చేయటం కోసం పెట్టిన పెట్టుబడి కూడా రావటం లేదు. దానితో రైతాంగానికి గిట్టుబాటు ధరలు రాక తీవ్రమైన నష్టాలను ఎదుర్కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసు కొంటున్న చర్యలు రైతాంగాన్ని దివాళా తీయించటానికి, కార్పొరేట్లు, బహుళజాతి సంస్థలకు మేలు చేసేదిగా ఉందని అంటున్నారు. ఈ సరుకుల నిల్వలపై ఉన్న పరిమితులను కూడా ఎత్తివేశారు. దానితో వ్యాపారులు తమ ఇష్టం వచ్చినంత సరుకును కొని నిల్వ చేసుకోవటానికి వీలు కల్పిస్తుందని అంటున్నారు. ఈ విధానం వినియోగదారులకు శరాఘాతంగా పరిణ మిస్తుందన్న ఆందోళన వ్యక్తం అవుతోంది.

కంపోస్టు షెడ్ ప్రారంభించిన ఎంపీపీ బూర వజ్రమ్మ బాబు

వేములవాడ, సెప్టెంబర్ 19 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ మండలం లోని చిర్ల వంచ గ్రామంలో కంపోస్టు షేడ్ ను శనివారం అర్బన్ మండల పరిషత్ అధ్యక్షురాలు బూర వజ్రమ్మ బాబు ప్రారంభించారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రంగు సతమ్మ రాములు, ఎంపీటీసీ దేవరాజు,ఉప సర్పంచ్ శ్రీనివాస్, సంకేపల్లి సర్పంచ్, అనుపురం సర్పంచ్, డి ఎల్ పి ఓ ,ఎం పి ఓ, ఏ పి ఎం, పంచాయతీ కార్యదర్శులు,వార్డు సభ్యులు, గ్రామస్తులు, పాల్గొన్నారు. అనంతరం తడి చెత్త పొడి చెత్త వేరు వేరుగా ఎలా చేయాలి,అలాగే సేంద్రీయ ఎరువును ఎలా తయారు చేయాలో కార్యదర్శులకు ,సర్పంచ్ లకు ఏ పి ఎం సురేష్ డెమో ద్వారా అవగాహన కల్పించారు

జిల్లాలో మారుతున్న సమీకరణాలు

పార్టీ శ్రేణులకు అందుబాటులో కవిత

వచ్చే మున్సిపల్ ఎన్నికలే లక్ష్యంగా వ్యూహం

నిజామాబాద్,సెప్టెంబర్19((ఆర్ఎన్ఎ): నిజామాబాద్‌లో మరోమారు పట్టు సాధించేలా మాజీ ఎంపి కవిత పావులు కదుపుతున్నారు. ప్రధానంగా ఎమ్మెల్సీ ఎన్నిక వాయిదా పడడంతో అది మళ్లీ ఎప్పుడు జరిగేది తెలియాల్సి ఉంది. ఇసి ఆదేశాలు వస్తే ఎన్నికల్లో గెలవడం ద్వారా మండలిలో ప్రవేశించి మళ్లీ రాజకయీంగా చురకుగా వ్యవహరించాలని చూస్తున్నారు. ఈ లోగా మున్సిపల్ ఎన్నికలపైనా ఆమె దృష్టి సారించి పార్టీ శ్రేణులను సమయాత్తం చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలో బిజెపిని దెబ్బకొట్టేలా చాపకింద నీరులా పనిచేస్తున్నారు. ఇందులో భాగంగా మున్సిపల్ ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమయాత్తం చేస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలో అర్బన్, రూరల్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరి ఆధ్వర్యంలోనే ఎన్నికలు జరుగనున్నాయి. మెజారిటీ 50 వార్డులు అర్బన్ ఎమ్మెల్యే పరిధిలో ఉన్నాయి. వీటితోపాటు మిగిలిన పది వార్డులు రూరల్‌తో పాటు ఆర్మూర్ ఎమ్మెల్యే పరిధిలో ఉన్నాయి. బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీలు ఆయా నియోజక వర్గాల ఎమ్మెల్యేల పరిధిలోనే ఉన్నాయి. భీమ్‌గల్ నుంచి మంత్రి ప్రాతినిధ్యం వహిస్తు న్నారు. కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపాలిటీలు ఆ నియోజకవర్గ ఎమ్మెల్యేల పరిధిలో ఉండగా, జగిత్యాల కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే పరిధిలో ఉన్నాయి. మున్సిపాలిటీల గెలుపు బాధ్యతను కూడా ఎమ్మెల్యేలకే అప్పగించనున్నారు. వీరి ఆధ్వర్యంలో మాజీ ఎంపీ కవిత పర్యవేక్షణలో కొనసాగ నున్నాయి. మున్సిపల్ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండడంతో అధికార పార్టీకి చెందిన ఎక్కువమంది నేతలు హైదరాబాద్‌కు తరలివెళుతూ, మాజీ ఎంపీ కవిత తోపాటు మంత్రి ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేశిష్ గుప్త, షకీల్ అమీర్, విద్యాసాగర్‌రావు, డాక్టర్ సంజయ్ కుమార్‌ను కలిసి వస్తున్నారు. వీరి తోపాటు మరికొంత మంది నేతలు పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను కలిసి మున్సిపల్ ఎన్నికల్లో తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

వడివడిగా మిషన్ భగీరథ పనులు

-మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

ఖమ్మం,సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ): ఇంటింటికి తాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పనులు వడివడిగా కొనసాగుతున్నాయని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. కలెక్టరేట్ లోని ప్రజ్ఞా సమావేశ మందిరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించాలని ప్రభుత్వం రూ.230 కోట్ల రూపాయలతో ప్రతిష్టాత్మకంగా చేపడుతుందన్నారు. మిషన్ భగీరథ పనులకు గాను తన అభ్యర్థన మేరకు పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ కొవిడ్ పరిస్థితుల్లో కూడా రూ.67.41 కోట్ల రూపాయల విలువైన చెక్కులను ఎల్ అండ్ టీ ప్రతినిధులకు అందజేశారు. ప్రభుత్వ లక్ష్యాన్ని పూర్తి చేసి ప్రతి ఇంటికి పరిశుభ్రమైన తాగునీటిని అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మేయర్ పాపాలాల్, జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్, మున్సిపల్ కమిషనర్ అనురాగ్ జయంతి, పబ్లిక్ హెల్త్ అధికారి రంజిత్ కుమార్ తదితరులు ఉన్నారు.

మనో ధైర్యమే కరోనాకు మందు

-సొంత ప్రజలకు ఎర్రబెల్లి భరోసా

హైదరాబాద్,సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ): కరోనా సోకితే భయపడకండి...మీకు మనో ధైర్యం ఇవ్వడం కోసమే ప్రతి రోజూ టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్నట్టు పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు భరోసా ఇచ్చారు. కరోనా బాధితుల్ని కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. పాలకుర్తినియోజక వర్గంలోని కరోనా బాధితులు, ప్రజా ప్రతినిధులు, అధికారులతో శుక్రవారం మంత్రి ఎర్రబెల్లి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఒక వైపు బాధితులుకు భరోసా కల్పిస్తూ మరో వైపు ప్రజా ప్రతినిధులకు సూచనలు చేశారు. బాధితుల బాధలుతెలుసుకుంటూ తనదైన శైలిలో వారికి సూచనలు చేశారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి కరోనా నుండి ప్రజల్ని గట్టెక్కించాలని సూచించారు. సీఎం కేసీఆర్ ఆలోచనలతో మంత్రులు కేటీఆర్, ఈటల రాజేందర్ సమన్వయంతో కరోనా నుంచి తెలంగాణను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. బాధితులు అందరూ కూడా ఆహారం ఏదైనా వేడి వేడిగా తినాలన్నారు. వరంగల్ ఎంజిఎం హాస్పిటల్‌లో మంచి వైద్యం అందుబాటులో ఉందని చెప్పారు. కరోనా బాధితుల్ని ఆదుకోవాలని ప్రజా ప్రతినిధులకు మంత్రి సూచించారు. తాను సొంత ఖర్చుతో మాస్కులు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. కరోనా ఎమె÷-జ్ంన్సీ పేషెంట్ల కోసం అంబులెన్స్ వాహనాలను కూడా సిద్ధం చేశామని మంత్రి ఎర్రబెల్లి వివరించారు.

ప్రపంచ శాంతియే ప్రగతి ఔషధం..!

(21 సెప్టెంబర్ అంతర్జాతీయ శాంతి దినం సందర్భంగా)

ప్రపంచవ్యాప్తంగా హింస, అశాంతి మరియు యుద్ధాలను నిరోధించే పలు చర్యలను ఐక్యరాజ్యసమితి సందర్భానుసారం పద్ధతి ప్రకారం నిర్వహిస్తున్నది. దేశాల మధ్య సరిహద్దు వివాదాలు, మత విద్వేషాలు, ఉగ్రవాద చర్యలు లాంటి సమస్యలు ఉత్పన్నం అయినపుడు ఐరాస మధ్యవర్తిత్వం చేస్తూ తగు పరిష్కార మార్గాలను అన్వేషిస్తుంది. ప్రపంచ శాంతి నెలకొనుట ద్వారానే విశ్వ ప్రగతి సాధ్యపడుతుందని నిర్ధారణకు వచ్చిన ఐరాస తీర్మానం ప్రకారం ప్రతియేటా 21 సెప్టెంబర్ రోజున సభ్యదేశాలు "అంతర్జాతీయ శాంతి దినం" పాటిస్తున్నాయి. అంతర్జాతీయ శాంతి దినం-2020 నినాదంగా ' ఐక్యతతో శాంతి స్థాపన (షేపింగ్ పీస్ టుకెదర్)'ను తీసుకొని ముందుకు సాగుతున్నాం. దేశాల మధ్య వివాదాలు బయట పడినపుడు ఐరాస చొరవ తీసుకొని సమస్యకు తాత్కాలిక లేదా శాశ్వత పరిష్కారం చూపుటకు మరియు కాల్పుల విరమణలకు కృషి చేస్తుంది. ప్రచ్ఛన్న యుద్ధం ప్రత్యక్ష పోరుగా మారకుండా పలు చర్యలను తీసుకొంటూ, యుద్ధ వాతావరణాన్ని చల్లబరచడం, మరియు మానవీయ కోణంలో సామాన్య ప్రజలకు చేయూత నివ్వడం అలవాటుగా వస్తున్నది. 1981లో తీసుకొన్న నిర్ణయం ప్రకారం 1982 నుండి ఐరాస దేశాలు, రాజకీయ సమూహాలు, మిలటరీలు మరియు సామాన్య ప్రజలు నిర్వహిస్తున్నారు. 2001 నుండి ఐరాస సభ్యదేశాలు నిర్వహించే అంతర్జాతీయ శాంతి దినం వేడుకలలో అహింస మరియు కాల్పుల విరమణను ప్రధాన అంశంగా తీసుకోవాలని అధికారికంగా ప్రకటించారు. దేశాల మధ్య మూడవ ప్రపంచ యుద్ధమే జరిగితే, అణ్వాయుధాలు, రసాయన ఆయుధాలు, ఆధునిక యుద్ధతంత్రాలు, అత్యాధునిక సాంకేతిక ఆయుధాలతో ప్రపంచంలో సకల మానవాళితో పాటు సర్వ ప్రాణులు మరియు మౌళిక వసతులు క్షణాలలో కాలి బూడిద కావడం ఖాయం అనిపిస్తున్నది.

ప్రస్తుతం ప్రపంచ దేశాల ఉమ్మడి శత్రువుగా, ప్రపంచ ఆరోగ్య సమస్యకు ఏకైక కారణంగా, (ఐరాస 75వ అవతరణ దినం సందర్భంగా) కరోనా వైరస్ కరాళనృత్యం మన ముందున్నది. ఈ సందర్భంగా ఐరాస రూపొందించిన 'యూయన్75' ఉద్యమంలో విశ్వ దేశాల మిలియన్ల ప్రజలు శాంతియజ్ఞంలో భాగస్వాములై కోవిడ్-19ను తరమాల్సిన సమయం ఆసన్నమైనదని కోరుతున్నాయి. చైనాలో పుట్టిన విశ్వ మహమ్మారి అన్ని దేశాలను తన కబంధహస్తాలలో బంధించి ఉక్కిరి బిక్కిరి చేస్తున్నది. కరోనా వైరస్ చైనా ప్రయోగశాలలో కృత్రిమ పద్ధతిలో తయారు చేయబడి, ప్రపంచదేశాలను అస్థిరపరిచేందుకు రసాన ఆయుధంగా వినియోగించారని అమెరికాతో పాటు అనేక దేశాలు చైనాపై విమర్శల వర్షం కురిపిస్తూనే ఉన్నాయి. కోవిడ్-19 విజృంభనతో ప్రపంచ శాంతి గాలిలో దీపమైందని, లడక్ సరిహద్దులలో దుర్బుద్ధిగల చైనా నిత్యం భారత సైన్యంతో గిచ్చి పంచాయతీ పెట్టుకునే దుస్సాహసమ చేస్తున్నదని అందరికీ తెలుసు. దినదినం పరిస్థితి ముదిరి యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. ఏ క్షణం ఏం జరుగుతుందో అనే ఉత్కంఠ నెలకొని శాంతి కపోతం గడగడలాడుతున్నది. ప్రస్తుత అకాలంలో సామాజిక దూరాలతో శాంతిని కోరుతూ దగ్గరై, మాస్కులతో మూతులు కట్టుకొని మాటను నిలబెట్టుకొని, సానిటైజర్‌తో చేతులు శుభ్రం చేసుకుంటూ మదిలోని దుర్బుద్ధులను కడిగి పారేస్తూ, విశ్వశాంత కపోతం రెపరెపలాడుతూ భూగోళాన్ని చుట్టేలా ప్రతి ఒక్కరం చేయూత అందించాలి. వైరస్‌తో వైరం పెరుగకుండా జాగ్రత్త పడుతూ దేశాల మరియు జాతుల మధ్య సోదరభావం, కరుణ, దయాగుణాలతో శాంతి స్థాపనకు కృషి చేయాల్సిందే.

సంస్కృతి, వారసత్వం, జీవన విధానాలలో భిన్నత్వం మరియు వైవిధ్యం కలిగిన విశ్వ మానవాళి, ఏకత్వాన్ని ఆధారంగా శాంతి స్థాపన చేయాలని సూచిస్తున్నారు. విద్యతో కళలను, క్రీడలతో సామాజిక న్యాయాన్ని, ఆరోగ్యకర పర్యావరణాన్ని, సేవలతో పరులను జయిస్తూ శాంతి నెలకొల్పే దిశలో మానవాళి ప్రయత్నాలు ఉండాలని ఐరాస కోరుతున్నది. ఆయుధాల వినియోగంతో అశాంతి పెరుగుతుందని, సదాలోచనలతో సమస్యలు సమిసిపోయి శాంతి రాజ్యమేలుతుందని అన్ని దేశాలు ఏకాభిప్రాయానికి రావాలి. హింస వికృతరూపం పేదరికం మరియు అసహనం అని అర్థం చేసుకోవాలి. శాంతికి మార్గం కాదు, మన మార్గమే శాంతి కావాలని నమ్ముదాం. స్వయం నియంత్రణ మరియు సహనంతోనే శాంతి సౌభాగ్యాలు నెలకొంటాయని చైనా లాంటి దేశాలు బుద్ధి తెచ్చుకోవాలి. ప్రపంచ శాంతి స్థాపనకు దోహదపడే అన్ని అంశాలను ప్రజలకు అవగాహన పరిచేందుకు ఈ రోజును రూపొందించుకోవాలి. దేశాల మధ్య యుద్ధాల్లో వేలలో సైనిక నష్టంతో పాటు కోట్లలో సామాన్యులు సమిధలై పోతారని మరువరాదు. శాంతి స్థాపన విధులలో ప్రాణాలర్పించిన యోధులకు నివాళులు అర్పిస్తూ, శాంతి ప్రార్థనలు, ఒక నిమిషం మౌనం పాటించడం, క్యాండిల్స్ వెలిగించడం, శాంతి ర్యాలీలు, శాంతి కోరుతూ మె?క్కలు నాటడం, శాంతి ఫోటో ప్రదర్శనలు, పిల్లలకు శాంతి ప్రాధాన్యతలను వివరించడం, సర్వమత ప్రార్థనలు వంటి పలు కార్యక్రమాలతో ప్రజల్లో అవగాహన కల్పించాలి. గత చరిత్ర మనకు ఎన్నో చేదు అనుభవాలను రుచి చూపింది. ఏ యుద్ధంతోనూ శాంతి స్థాపన జరుగలేదు. విభేధాలను సమన్వయంతో శాంతియుతంగా పరిష్కరించుకున్నపుడు, ఒక్క రక్తపుధార పారకుండా ప్రపంచమంతటా శాంతి మేఘాలు కమ్ముకొని, నలుదిశల శాంతి వర్షాల సంపదలను కురుపిస్తుంది. చేతులు కలిపితే అభివృద్ధి, తోడ కొడితే రక్తపాతం తప్పదని చైనాలాంటి దేశాలు గుర్తుంచుకోవాలి. ప్రపంచాభివృద్ధిలో శాంతి మార్గమే ప్రధానం.

సరిహద్దులను చెరిపేసిన సాంకేతిక డిజిటన్ యుగం విశ్వాన్ని కుగ్రామం చేసి అరచేతిలో నిలిపింది. ప్రపంచ శాంతితో మానవాళి మూడుపువ్వులు ఆరుకాయలుగా జీవితాలను పండించుకోవాలని ఆశిద్దాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

మున్సిపల్ ఎన్నికలకు ముందస్తు వ్యూహాలు

పురపాలికల్లో పాగా వేసేలా కెటిఆర్ చర్చలు

డబుల్ ఇళ్లతో గాలం వేసేలా అధికార పార్టీ యత్నాలు

హైదరాబాద్,సెప్టెంబర19(ఆర్ఎన్ఎ): మున్సిపల్ ఎన్నికలకు అతి త్వరలోనే నోటిఫికేషన్ రానుండడంతో అధికార పార్టీ నేతలు కసరత్తు చేస్తున్నారు. ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు వరంగల్ లాంటి మహానగరాలకు ఎన్నికలు రానున్నాయి. దీంతో మున్సిపల్,ఐటి శాఖ మంత్రి కెటిఆర్ తరచూ సమీక్షలతో అభివృద్ధి కార్యక్రమాలను విశ్లేషిస్తూ వ్యూహాత్మకంగా సాగుతున్నారు. ప్రధానంగా చర్చలన్నీ డబుల్ ఇళ్ల చుట్టూ తిరుగుతున్నాయి. డబుల్ ఇళ్లతో పేదలకు గూడు కల్పిస్తామని చెప్పిన నేతలు ఇప్పుడు లక్ష, ఇళ్లు అందుబాటులో ఉన్నాయని చెప్పడం వెనక మతలబు ఇదే. కాంగ్రెస్ పార్టీ కూడా ఇళు బోగస్ అని ప్రచారం చేయాలనుకుంటోంది. ఈ కోవలోనే మంత్రి తలసాని, భట్టిల పర్యటన సాగింది. మొత్తంగా గ్రేటర్‌లో రాజకీయాలు డబుల్ ఇళ్ల చుట్టూ తిరగడం ఖాయంగా కనిపిస్తోంది. మున్సిపల్ ఎన్నికలపై అధికార పార్టీ నేతలు గత కొన్ని రోజులుగా పలు దఫాలు హైదరాబాద్‌లో చర్చించారు. పలు దఫాలు సమావేశాలను నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి కెటిఆర్‌తోపాటు ఎమ్మెల్యేలు, కీలక నేతలు పాల్గొని మున్సిపల్ ఎన్నికలపై చర్చించారు. మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు జరిగినా తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకునే విధంగా చర్చలు జరిపారు. సీ ఎం కేసీఆర్ ఆదేశించిన విధంగా మున్సి పాలిటీలపైనా వీరు చర్చించారు. రిజర్వేషన్‌లు ప్రకటించి నోటిఫికేషన్ వచ్చిన వెంటనే రంగంలోకి దిగే విధంగా ఈ చర్చలను సాగిస్తున్నారు. మొత్తం మున్సిపాలిటీల్లో మళ్లీ టీఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవేసే విధంగా ప్రయత్నాలను మొదలుపెట్టారు. అన్ని ఎన్నికల్లో టీఆర్ఎస్ అత్యధిక సీట్లను కై వశం చేసుకున్నందున మొత్తం మున్సిపాలిటీలను గెలిపించు కునే విధంగా చూడాలని సీఎం ఆదేశించడంతో వీరు తీవ్ర ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని అన్ని మున్సిపాలిటీల్లో మళ్లీ పాగా వేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. రిజర్వే షన్‌లను ప్రకటించిన వెంటనే అభ్యర్థులను బరిలోకి దించేందుకు సన్నద్ధాలు చేస్తున్నారు. అన్ని మున్సిపాలిటీల పరిధిలో మెజారిటీ వార్డులు కైవశం చేసుకునే విధంగా నేతలతో చర్చిస్తున్నారు. కొత్తవారికి సైతం ఈ దఫా అ వకాశం ఇచ్చేందుకు పరిశీలిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీలకు ధీటుగా మెజారిటీ స్థానాలను గెలుచుకునే విధంగా వ్యూహాలను రచిస్తున్నారు. నోటిఫికేషన్ రాగానే బరిలోకి దిగే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అందుకు సన్నాహకంగా ముందస్తుగా నేతలు చర్చించి, మున్సిపల్ ఎన్నికల్లో భారీ మెజారిటీని సాధించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. అన్ని మున్సి పాలిటీల పరిధిలో టీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలే ఉన్నారు. ప్రతిపక్షపార్టీల నేతలు లేరు. మున్సిపాలిటీల గెలుపు బాధ్యతను కూడా ఎమ్మెల్యేలకే అప్పగించనున్నారు. ఇకపోతే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల మీద రాష్ట్ర ఎన్నికల సంఘం ఫోకస్ పెట్టినట్టు చెబుతున్నారు. గ్రేటర్ ఎన్నికల పై రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులతో సమావేశం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి అయినట్టు తెలుస్తోంది. అలానే ఎన్నికల నిర్వహణ పై సమీక్ష నిర్వహించినట్టు చెబుతున్నారు. ఎన్నికలకు ముందు చేయాల్సిన పనులపై ఈ సమీక్షలో చర్చించి నట్టు చెబుతున్నారు. గ్రేటర్ అధికారులకు ట్రైనింగ్ కోసం ప్రణాళిక సిద్ధం చేయాలని ఆయన ఆదేశించి నట్టు చెబుతున్నారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు సాంకేతిక సహకారంతో సాంకేతికత ను ఎక్కువగా ఉపయోగించాలని ఆయన పేర్కొన్నట్టు సమాచారం. పోలింగ్ శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలి.. గత ఎన్నికల్లో 45.29 శాతం పోలింగ్ మాత్రమే జరిగిందని ఆయన పేర్కొన్నారు. కోవిడ్ నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఇచ్చిన గైడ్ లైన్స్ పాటించాలని, అయితే బ్యాలెట్ ద్వారా నిర్వహించాలా, లేక ఈవీఎంల ద్వారా నిర్వహించాలా అనే దాని మీద నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ బూత్ లో 8 వందలకు మించకుండా ఓటర్లు ఉండేలా ప్లాన్ చేస్తున్నట్టు చెబుతున్నారు.

మోసపోయేది రైతులే కనుక వ్యతిరేకిస్తున్నారు

-మోడీ ప్రభుత్వంపై వారికి విశ్వాసం లేదన్న రాహుల్

న్యూఢిల్లీ,సెప్టెంబర్18(ఆర్ఎన్ఎ): మోదీ చేస్తున్న మోసాలు రైతులకు కాబట్టే వ్యవసాయ బిల్లులను వారు వ్యతిరేకిస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. మోదీ ప్రభుత్వంపై రైతులకు ఏమాత్రం విశ్వాసం లేదని, అది గతంలో అనేక సార్లు నిరూపితం అయిందని ఆయన అన్నారు.

ఈ విషయమై ట్విట్టర్ వేదికగా ప్రధాని మోదీపై రాహుల్ విమర్శలు గుప్పించారు. మోదీ ప్రభుత్వంపై రైతులకు విశ్వాసం ఏమాత్రం లేదు. ఎందుకంటే మోదీ చెప్పే మాటలకు చేసే పనులకు పొంతన ఉండదు. నోట్లరద్దు, తప్పుడు జీఎస్టీ, డీజిల్ ధరలు ఇష్టారీతిన పెంచడం లాంటి అనుభవాలు వారికున్నాయి. ఇప్పుడు తెస్తున్న వ్యవసాయ బిల్లుల ద్వారా తన మిత్రులైన వ్యాపారవేత్తలకు లాభం చేకూర్చేది. రైతుల జీవనోపాధిపై దాడి చేసేంది. అందుకే రైతులు ఏకమయ్యారని రాహుల్ ట్వీట్ చేశారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిసేలోప

కొల్లాపూర్ గులాబీలో ఆధిపత్య పోరు

ఎంపిపి రాజీనామాతో బయటపడ్డ విభేదాలు
సర్ది చెప్పేందుకు లీడర్ల నిరుత్సాహం

మహబూబ్‌నగర్,సెప్టెంబర్19 (ఆర్ఎన్ఎ): కొల్లాపూర్ గులాబీ పార్టీలో గల్లీ నుంచి నియోజకవర్గ స్థాయి వరకూ పంచాయితీలు నడుస్తున్నాయి. మ్మెల్యే హర్షవర్ధన్, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు మధ్య ఆధిపత్య పోరు పార్టీలో రెండువర్గాలుగా చీలింది. అధికారంలో ఉన్న పార్టీ కదా.. నేతల మధ్య విభేదాలు సహజం అనుకున్నా అంతకు మించి నేతలు పనిచేస్తున్నారు. వారితోపాటు వారి కేడర్ కూడా అలాగే చేస్తుంది. అయితే కొల్లాపూర్ టీఆర్ఎస్‌లో వర్గపోరు రూటు మార్చేసింది. పదవులకు సైతం గుడ్‌బై చెప్పేస్తున్నారు స్థానిక ప్రజా ప్రతినిధులు. ఈ విభేదాలు కిందిస్థాయి ప్రజాప్రతినిధులకు కూడా ఇబ్బందిగా మారినట్లు వినిపిస్తున్నది. ప్రస్తుతం నియోజకవర్గంలో ఎమ్మెల్యే, మాజీ మంత్రి వర్గాలు బహిరంగ ఆరోపణలు చేసుకుంటున్నాయి. ఒకరినొకరు సవాళ్లు విసురుకుంటున్నారు. ఎమ్మెల్యే సిఫారసు చేసిన పనులకే అధికారులు ఓకే చెబుతుండటంతో జూపల్లి వర్గం రుసరుసలాడుతోందట. ఈ వర్గపోరుకు అధికారుల తీరు ఇంకా ఆజ్యం పోస్తోందని టాక్. మాటలకే పరిమితమైన వర్గపోరు ఇప్పుడు క్షేత్రస్థాయిలో రాజీనామాలకు కారణం కావడంతో కలకలం మొదలైంది. లోకల్ బాడీ ఎన్నికల్లో ఎక్కడా సహకరించుకోని పరిస్థితి. పార్టీ పెద్దలు చెప్పినా ఎవరిదారి వారిదే. ఈ క్రమంలో ఎవరెటో తేల్చుకోవాలని కేడర్‌పై ఒత్తిడి చేస్తున్నారట నేతలు. దీంతో ఈ ఒత్తిళ్లు తట్టుకోలేక పదవులకు గుడ్‌బై చెప్పేస్తున్నారు నాయకులు. చెప్పినట్లు వినకపోతే అభివృద్ధి పనులు జరగబోవని.. నిధులు విడుదల కావని భయపెడుతున్నారట నాయకులు. ఇదే సమయం అనుకున్నారో ఏమో కానీ.. కొల్లాపూర్‌లోని అధికారులు సైతం స్థానిక ప్రజాప్రతినిధులను లెక్కచేయడం లేదన్న విమర్శలు ఉన్నాయి. . కోడేరు ఎంపీపీ రాధ తనకెదురైన అనుభవాలను బయటపెట్టి కన్నీటి పర్యంతమయ్యారు. మాజీ మంత్రి జూపల్లి వర్గంలో రాధ ఉండటంతో.. ఎమ్మెల్యే హర్షవర్ధన్ వర్గం అడుగడుగునా ఆమెకు అడ్డుపడుతున్నారని విమర్శలు ఉన్నాయి. దీంతో అభివృద్ధి పక్కకు పోయి రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ వివాదం ఇలా ఉండగానే కొల్లాపూర్ ఎంపిపి గాదెల సుధారాణి తన పదవులకు రాజీనామా చేశారు. ఇది పార్టీలో చర్చకు దారితీసింది. ఆరోగ్య సమస్యలు, వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు ఆమె చెప్పినప్పటికీ తెర వెనక ఏదో జరిగిందని అనుమానిస్తున్నారు. సుధారాణి ఎమ్మెల్యే హర్షవర్ధన్ వర్గంలో ఉన్నారు. ఎమ్మెల్యే వచ్చిన అభిప్రాయ భేదాలే రాజీనామాకు దారితీశాయనే ప్రచారం జోరందుకుంది. సుధారాణి భర్త రత్న ప్రభాకర్‌రెడ్డి పార్టీలో చురుకుగా ఉండేవారు. గతంలో జూపల్లి వర్గంలో ఉన్నా.. తర్వాత హర్షవర్ధన్ శిబిరంలో చేరిపోయారు. మారిన రాజకీయ సమీకరణాలతో ఒత్తిళ్లు తట్టుకోలేక సుధారాణి రాజీనామా చేసినట్లు చెబుతున్నారు

కరోనా కష్టాలను తొలగించే ప్రయత్నాలు ఏవీ?

జీతాలు లేక వీధికెక్కిన వారిని పట్టించుకోని ప్రభుత్వం
మరోవైపు ప్రజలపై అదనపు భారాలను మోపుతున్న సర్కార్

అమరావతి,సెప్టెంబర్19((ఆర్ఎన్ఎ): కరోనాలో కష్టాలు పడుతున్న ప్రజానీకానికి నవరత్నాలే సమాధానంగా మన రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నది. అవి కూడా కొంత మందికి సరిగ్గా అందక ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు ప్రజలపై అదనపు భారాలను మోపుతున్నారు. కేంద్రం పెట్రోలు, గ్యాస్ ధరలు పెంచితే రాష్ట్రం ఇసుక ధర పెంచింది. దాంతో నిత్య జీవితావసర ధరలు పెరగడమేగాకుండా నిర్మాణ పనులు పోయాయి. లక్షలాది భవన నిర్మాణ కార్మికులు వీధులపాలయ్యారు. లాక్‌డౌన్ పేరు చెప్పి యజమానులు కార్మికులకు జీతాలివ్వకుండా ఇళ్ళకు పంపించేశారు. ప్రభుత్వ రంగంలో పని చేస్తున్న ఆర్టీసి అవుట్ సోర్సింగ్ కార్మికులు, ప్రభుత్వ అవుట్ సోర్సింగ్, ప్రయివేటు టీచర్లు, లెక్చరర్లు, స్టాఫ్‌కు గత ఐదు మాసాలుగా జీతాలు లేవు. వీరంతా బతుకుదెరువు కోసం వీధులకెక్కారు. రాష్ట్ర ఖజానా నింపుకోవడానికి అప్పులు చేయడంతో పాటు ప్రజలపై యూజర్ ఛార్జీల భారం మోపడానికి ప్రభుత్వం సిద్ధపడింది. ప్రతి మండలంలో రెండు గ్రామాల చొప్పున ఎంచుకొని చెత్త సేకరణకు రోజుకు రెండు రూపాయల చొప్పున వసూలు చేస్తున్నది. పట్టణాల్లో చెత్త పన్నుతోపాటు ఆస్తిపన్ను కూడా పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కృష్ణా, గోదావరికి వరదలు పోటెత్తి ఆస్తి, పంట నష్టం జరిగినా ఎలాంటి సహాయం అందలేదు. గత సంవత్సరం వరదల్లో దెబ్బతిన్నవారికి కూడా ఇంత వరకూ పరిహారం ఇవ్వలేదు. నిర్మాణం పూర్తయి ఖాళీగా ఉన్న ఇళ్ళను లబ్ధిదారులకు అందించకుండా కాలయాపన చేస్తున్నారు. రేషను బియ్యం బదులు నగదు బదిలీ చేస్తామంటున్నారు. మరోవైపు రాష్ట్రంలో దళితులు, మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరుగు తున్నాయి. ముఖ్యమంత్రి సారథ్యంలోని మానిటరింగ్ సెల్ కనీసం ఒకసారి కూడా సమావేశమై సమీక్షించలేదన్న విమర్శలు ఉన్నాయి. గత ఆరు మాసాలుగా రాష్ట్రమంతా కరోనాతో అల్లాడిపోతున్నది. అనూహ్యంగా కరోనా విస్తరణలో మన రాష్ట్రం రెండవ స్థానంలోకి, మరణాల్లో మూడో స్థానంలోకి చేరింది. టెస్టులు ఎక్కువ చేసినందువల్ల కేసుల సంఖ్య పెరిగిందని సమాధానం చెబుతున్నారు. కానీ టెస్టుల సంఖ్యతో నిమిత్తం లేకుండా మరణాల సంఖ్య ఎందుకు పెరుగుతున్నదో వారి దగ్గర సమాధానం లేదు.ఇప్పుడు ఉచిత విద్యుత్ కొనసాగుతుందని హామీ ఇచ్చినా మీటర్లు పెట్టి నగదు బదిలీ చేయడమంటే రైతు మెడపై కత్తిని వేలాడదీయడమే. మీటర్లు, నగదు బదిలీ వ్యవసాయానికి ఉరితాడని గతంలో ప్రకటించిన వైఎస్సార్ కాంగ్రెస్ నేడు అధికారం లోకి వచ్చాక దాన్నే అమలు చేస్తున్నది. కేంద్రాన్ని సంతృప్తి పర్చడానికి అందరికన్నా ముందే దీన్ని అమలు చేస్తున్నారు.ప్రత్యేక హోదా ఇవ్వలేదు. విభజన హామీలు అమలు జరుపలేదు. జిఎస్టీ నిధులూ ఇవ్వలేదు. ఇంత హాని చేస్తున్నా జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయకుండా సాగిలపడుతున్నారు.

కరోనా వైద్య సేవల్లో ఎక్కడా లోటు రాకూడదు

అన్ని కోవిడ్ ఆస్పత్రుల్లో ప్లాస్మా థెరపీకి అనుమతి
ఆరోగ్యశ్రీ పథకం సమన్వయ బాధ్యతలు జేసీకి అప్పగింత
కరోనా కేసుల సంఖ్య క్రమంగా తగ్గుతోంది
-అధికారులతో సిఎం జగన్ సమీక్ష

అమరావతి,సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ): కరోనా వైద్య సేవల్లో ఎక్కడా ఏలోటు రాకూడదని, సిబ్బంది నియామకాలు త్వరితగతిన పూర్తి చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అన్ని కోవిడ్ ఆస్పత్రుల్లో ప్లాస్మా థెరపీకి అనుమతి ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా ఆరోగ్య ఆసరాలో ఆర్థిక సహాయం పెంచామని, సాధారణ కాన్పుకు రూ.5 వేలు. సిజేరియన్‌కు రూ.3 వేలు అందించనున్నట్లు తెలిపారు. అన్ని ఆరోగ్యశ్రీ ఆస్పత్రులలో తప్పనిసరిగా హెల్ప్‌డెస్క్‌లు ఉండాలని, ఆరోగ్యమిత్రలు ఆరు రకాల బాధ్యతలు నిర్వర్తించాలని పేర్కొన్నారు. అదే విధంగా.. జిల్లా స్థాయిలో ఆరోగ్యశ్రీ పథకం సమన్వయ బాధ్యతలు జేసీకి అప్పగిస్తున్నట్లు వెల్లడించారు. మరింత సమగ్ర సమాచారంతో ఆరోగ్యశ్రీ క్యూఆర్ కోడ్ కార్డులు రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. కోవిడ్-19 నివారణ చర్యలు, ఆరోగ్యశ్రీ పథకంపై సీఎం జగన్ తన క్యాంపు ఆఫీసులో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ప్రస్తుత కోవిడ్ పరిస్థితుల గురించి అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. కరోనా కేసుల సంఖ్య క్రమంగా తగ్గుతోందని, కోవిడ నిర్ధారణ పరీక్షలు, వైద్య సదుపాయాలు తదితర అంశాల గురించి సమావేశంలో తెలిపారు. ఈ క్రమంలో అన్ని ఆస్పత్రులలో ప్రమాణాలు పెరిగి, మంచి గ్రేడింగ్ వచ్చేలా చూడాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. ఐవీఆర్ఎస్‌లో అడిగే ప్రశ్నలు మరింత స్పష్టంగా ఉండాలని, ముఖ్యంగా వైద్య సేవలు, శానిటేషన్‌పై పూర్తి వివరాలు ఆరా తీయాలని, ఆ మేరకు ప్రశ్నలు మార్చాలని సూచించారు. ఇక హోం ఐసోలేషన్‌లో ఉన్న ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా కిట్లు ఇవ్వాలన్న సీఎం, ఆ మేరకు అధికారులు పక్కాగా పర్యవేక్షించాలని ఆదేశించారు. అన్ని కోవిడ్ ఆస్పత్రులలో ప్లాస్మా థెరపీ నిర్వహించాలని, దాతలను ప్రోత్సహించే విధంగా రూ.5 వేలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు.

ఆరోగ్యశ్రీ ఆస్పత్రుల్లో హెల్ప్ డెస్కులు

రాష్ట్రంలోని 540 ఆరోగ్యశ్రీ ఆస్పత్రులలో ఇప్పటికే హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు కాగా, మిగిలిన 27 ఆస్పత్రుల్లో కూడా త్వరలో ఏర్పాటు కానున్నాయని సమీక్షా సమావేశంలో ఆరోగ్యశ్రీ అధికారులు వివరించారు. ఇందుకు స్పందనగా.. రాష్ట్రంలోని అన్నిఆరోగ్యశ్రీ ఆస్పత్రులలో వెంటనే ఆరోగ్యమిత్రలను ఏర్పాటు చేయాలన్నసీఎం జగన్ వారిని ఆదేశించారు. ఆరోగ్య మిత్రలు ప్రధానంగా 6 బాధ్యతలు నిర్వర్తించాలని నిర్దేశిరచారు. ఆస్పత్రిలో వైద్య మౌలిక సదుపాయాలు, వైద్యుల అందుబాటు, ఆహారంలో నాణ్యత, శానిటేషన్, వైఎస్సార్ ఆరోగ్య ఆసరా అందేలా చూడడం, పేషెంట్ కేరింగ్.. ఈ 6 అంశాలను ఆరోగ్యమిత్రలు చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. భవిష్యత్తులో విలేజ్ క్లినిక్‌లు ఆరోగ్యశ్రీకి రెఫరల్‌గా ఉంటాయని, ఆ తర్వాత కోవలో పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, జిల్లా ఆస్పత్రులు, టీచింగ్ ఆస్పత్రులు రెఫరల్‌గా ఉంటాయని తెలిపారు. ఆరోగ్యమిత్రకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఆస్పత్రి బయట, లోపల తప్పనిసరిగా ప్రదర్శించాలని, రెండు వారాల్లోగా అన్ని ఆస్పత్రులలో వారి నియామకాలు పూర్తి కావాలని నిర్దేశించారు.

ఆస్పత్రుల గ్రేడింగ్

ప్రతి ఆరోగ్యశ్రీ ఆస్పత్రికి గ్రేడింగ్ తప్పనిసరి అన్న సీఎం జగన్, అక్కడ సదుపాయాలు, సేవల ఆధారంగా వాటి నిర్ధారణ జరుగుతుందని, అన్ని ఆస్పత్రులు ఏకేటగిరీలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు 6 నెలల సమయం ఇవ్వాలని, ఆలోగా అవి ప్రమాణాలు పెంచుకోకపోతే జాబితా నుంచి తొలగించే అంశం పరిశీలించాలని సూచించారు. అదే విధంగా అన్ని ఏకేటగిరీ ఆస్పత్రులు ఏడాదిలోగా ఎన్ఏబీహెచ్ గుర్తింపు పొందాలని నిర్దేశిరచారు. జిల్లా స్థాయిలో ఆరోగ్యశీ పథకం సమన్వయ బాధ్యతలను ఇక నుంచి ఒక జేసీకి అప్పగించాలని సీఎం ఆదేశించారు.

మెగా వైద్య శిబిరాలు

రోగ్యశ్రీ ఆస్పత్రుల్లో? ఆరోగ్య ఆసరా కింద సాధారణ కాన్పుకు ఇక నుంచి రూ.5 వేలు, అదే విధంగా సిజేరియన్ కాన్పుకు రూ.3 వేలు ఇవ్వాలని సీఎం జగన్ ఆదేశించారు. అదే విధంగా గతంలో మాదిరిగా మెగా వైద్య శిబిరాలు నిర్వహించాలన్న ముఖ్యమంత్రి, ప్రతి నియోజకవర్గంలో ఆ శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు, ఆ తర్వాత వైద్య సదుపాయాల కల్పనపై ఎన్ఓపీ రూపొందిం చాలని ఆదేశించారు.ఇక రాష్ట్రంలో ఇప్పుడున్న 11 టీచింగ్ ఆస్పత్రులతో పాటు, కొత్తగా ఏర్పాటు కానున్న 16 ఆస్పత్రులు, ఇంకా ఐటీడీఏల పరిధిలో ఏర్పాటవుతున్న అని ఆస్పత్రులలో తప్పనిసరిగా ప్రమాణాలు ఉండేలా చూడాలని సీఎం ఆదేశించారు. ఆస్పత్రుల్లో వైద్య సదుపాయాలు, వైద్యుల అందుబాటు, ఆహారం, శానిటేషన్‌తో పాటు, యాంబియెన్స్ బాగా ఉండేలా చూడాలని ఆదేశించారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో కూడా అవే ప్రమాణాలు ఉండాలని ఆయన నిర్దేశించారు.

తగ్గుతున్న కేసులు

రాష్ట్రంలో కోవిడ్ పాజిటివ్ కేసుల సంఖ్య క్రమంగా తగ్గుతోందని అంతకు ముందు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 48,84,371 కోవిడ్ పరీక్షలు చేయగా, ఇప్పుడు 94,453 యాక్టివ్ కేసులు ఉన్నాయని వారు తెలిపారు. ఇక పాజిటివిటీ రేటు 12.31 శాతం కాగా, రికవరీ రేటు 84.48 శాతంగా ఉందని, మరణాల రేటు కూడా కేవలం 0.86 శాతం మాత్రమే నమోదవుతోందని చెప్పారు.

రాష్ట్రంలో ఆక్సీజన్ బెడ్లు 18609 ఉండగా, వాటిలో 5723 మంది రోగులు చికిత్స పొందుతున్నారని, ఆక్సీజన్ సదుపాయం లేని బెడ్లు 15060 ఉండగా, వాటిలో 9777 మంది రోగులు చికిత్స పొందుతున్నారని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. అదే విధంగా ఐసీయూ బెడ్లు 4469 ఉండగా, వాటిలో 2246 మంది చికిత్స పొందుతున్నారని, 2,522 వెంటిలేటర్లు అందుబాటులో ఉండగా, 178 రోగులు వాటిపై చికిత్స పొందుతున్నారని తెలిపారు. నెల 16వ తేదీ నాటికి 11,01,625 శాంపిల్స్ సేకరించి పరీక్ష చేయగా, 1,56,323 కేసులు పాజిటివ్‌గా తేలాయన్న అధికారులు, 17వ తేదీన ఒక్క రోజే 75 వేల పరీక్షలు చేశామని చెప్పారు. కోవిడ్ చికిత్స కోసం అన్ని జిల్లాలలో పూర్తి సదుపాయాలు ఉన్నాయని, ఏ పరిస్థితి అయినా ఎదుర్కొనేందుకు కలెక్టర్లు పూర్తి సన్నద్ధంగా ఉన్నారని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా కోవిడ్ చికిత్స కోసం 268 ఆస్పత్రులను సిద్ధం చేయగా, వాటిలో 230 ఆస్పత్రులను ఇప్పటి వరకు వినియోగించామని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. ఇక అన్ని ఆస్పత్రులలో 4469 ఐసీయూ బెడ్లు, ఆక్సీజన్ సదుపాయం ఉన్న నాన్ ఐసీయూ బెడ్లు 18,609, నాన్ ఐసీయూల్లో ఆక్సీజన్ సదుపాయం లేని బెడ్లు 15,060 ఉన్నాయని, ఆ విధంగా అన్ని కోవిడ్ ఆస్పత్రులలో 38,025 బెడ్లు అందుబాటులో ఉండగా, ఇప్పటి వరకు 36,232 బెడ్ల వినియోగం జరిగిందని తెలిపారు. కాగా, ఇప్పుడు కోవిడ్ ఆస్పత్రులలో 17,924 మంది రోగులు, కోవిడ్ కేర్ సెంటర్ల (సీసీసీ)లో 15,625 మంది రోగులు చికిత్స పొందుతుండగా, హోం ఐసోలేషన్‌లో 60,905 మంది ఉన్నారని అధికారులు చెప్పారు.అన్ని ఆస్పత్రులలో మంజూరు చేసిన పోస్టులన్నీ వెంటనే భర్తీ అయ్యేలా చూడాలని సీఎం జగన్ ఆదేశించారు.

పల్లెప్రకృతి వనం ప్రతీ ఒక్కరికీ ఉపయోగమే

-ఎంపీపీ బూర వజ్రమ్మ

వేములవాడ, సెప్టెంబర్ 19 (నేటినిజం ప్రతినిధి):పల్లె ప్రకృతి వనాల ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు స్వచ్ఛమైన ప్రాణవాయువు లభిస్తుందని వేములవాడ అర్బన్ మండల ఎంపీపీ బూర వజ్రమ్మ బాబు అన్నారు .వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామంలో పల్లె ప్రకృతి వనంలో మొక్కలు నాటే ఈ కార్యక్రమానికి ఆమె ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్లె ప్రకృతి వనాలతోప్రజలకు మానసిక ప్రశాంతత కలుగుతుందని అన్నారు దగ్గరదగ్గరగా మొక్కలు నాటడం వల్ల చిట్టడవిలా ప్రకృతి వనాలు మారతాయని అన్నారు .

ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఊరడి రాంరెడ్డి ,ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణ స్వామి , ఉప సర్పంచ్ తాడెం శ్రీనివాస్ ,వార్డ్ సభ్యులు బెజగం మహేష్ ,తునికి నర్సయ్య, తునికి కనుకరాజు, కట్ట లావణ్య తిరుపతి,అనుముల కావ్య భరత్,గాలిపెల్లి రవి ,నడిగొట్ల స్వప్న హరికృష్ణ, ఎరుగోక్కుల అంజలి దేవయ్య,కట్ట లక్ష్మీ దేవయ్య,కో అప్షన్ సభ్యులు జిల్లా కృష్ణమూర్తిపసింగిల్ విండో చెర్మెన్ రేగులపాటి కృష్ణదేవ రావు,,విద్యా కమిటీ చెర్మెన్ తునికి నరేష్ ,మార్కెట్ కమిటీ వైస్ చెర్మెన్ ఉరడి ప్రవీణ్,ఎంపీఒ శ్రీధర్ ,ఆనంద్ ,టి ఏ తిరుపతి ,మాజీ సర్పంచ్ లు పిల్లి రేణుక కనకయ్య,పార్వతి రాంచంద్రం, మాజీ ఎంపీటీసీ తునికి లక్ష్మీ మల్లయ్య,సింగిల్ విండో డైరెక్టర్ వంకాల రాజు , గొనె భాస్కర్, కట్ట ఎల్లయ్య, ఊరడి బాలకిషన్,కట్ట శ్రీనివాస్, టీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఉరడి రాజిరెడ్డి మరియు సంకెపల్లి సర్పంచ్ జింక సునీత వేణు ,అనుపురం సర్పంచ్ కొండపల్లి వెంకటరమణ రావు, ఉపాధ్యాయులు వంకాల లక్ష్మీరాజం,ఉరడి రవి,,గ్రామ సెక్రటరీ దిలీప్ రెడ్డి ,కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు కత్తి కనకయ్య,మాజీ వార్డ్ సభ్యులు,గ్రామ కుల సంఘాలు ,ఆశ వర్కర్లు,గ్రామ దీపికలు,తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రకృతి వనంకు దాతలు
,సర్పంచ్ ఊరడి రాంరెడ్డి
గాలిపెల్లి సువర్ణ స్వామి
,ఊరడి రవి టీచర్
,ఊరడి ప్రవీణ్
ఊరడి రాజిరెడ్డి
తాడెం లచ్చయ్య-
కు గ్రామ పంచాయతీ పాలకవర్గం కృతజ్ఞతలు తెలిపారు.

మిడ్‌మానేరుకు భారీగా వరదనీరు

రాజన్నసిరిసిల్ల,సెప్టెంబర్19(నేటినిజం ప్రతినిధి): : భారీగా వస్తున్న వరద నీటితో శ్రీ రాజరాజేశ్వర జలాశయం మిడ్ మానేరు నిండుకుంటోంది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 27.5 టీఎంసీ కాగా... ప్రస్తుతం 26.17 టీఎంసీగా నమోదు అయ్యింది. అలాగే ఇన్ ఎలో 9333 క్యూసెక్కులు, అవుట్ ఎలో 7030 క్యూసెక్కులుగా ఉంది. మిడ్ మానేర్ ప్రాజెక్టు నీటి నిల్వ లైవ్ కెపాసిటీని దాటింది. దాటిన ప్రాజెక్టు నుండి 6 రేడియల్ గేట్ల ద్వారా ఎల్ఎండీకి 7030 క్యూలెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారు. మిడ్ మానేరు బ్యాక్ వాటర్‌తో సంకేపల్లి, అరెపల్లి గ్రామాలకు పొంచి ఉన్న ప్రమాదం ఉందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశించారు. మిడ్ మానేరులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుకుంటోంది. దీంతో సంకేపల్లి, అరేపల్లి గ్రామాలు ప్రమాదం బారిన పడబోతున్నాయి. బ్యాక్ వాటర్‌తో గ్రామాలకు ముప్పు పొంచి ఉంది. అర్ధరాత్రి ఇళ్ళు ఖాళీ చేయాలని పోలీసులు హెచ్చరిక జారీ చేశారు. వృద్ధులు, పిల్లలతో ఎలా వెళతాం అంటూ గ్రామస్తుల ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిహారం ఇవ్వకుండా గ్రామాన్ని వదిలేది లేదంటూ మహిళలు భీష్మించారు.

వైకాపాను ఎదురిస్తూ ..ఎదగాలన్న ఆలోచన

అంతర్వేది ఘటనతో హిందుత్వ ఓటు బ్యాంక్‌పై దృష్టి
దూకుడు పెంచిన బిజెపి అధ్యక్షుడు సోము వీర్రాజు

విజయవాడ,సెప్టెంబర్19((ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో వైకాపా సర్కార్ తప్పిదాలను విమర్శిస్తూనే టిడిపిని కూడా దెబ్బతీసి పెద్ద పార్టీగా ఎదగాలన్నది బిజెపి వ్యూహంగా మారింది. ఇటీవల ఆలయాలపై దాడులు, అంతర్వేది ఘటనలను ఆసరాగా చేసుకుని బిజెపి దూసుకుని పోతున్నది. పార్టీ అధ్యక్షుడిగా సోము వీర్రాజును తీసుకురావడంతో ఆయన కూడా తన సత్తా చాటి పార్టీని బలోపేతం చేసే దిశగా సాగుతున్నారు. అంతర్వేది రథం దగ్ధం ఘటన తర్వాత సోము వీర్రాజు బాగా చురుకుగా సాగుతున్నారు. కొత్త కార్యవర్గం కూర్పులో మాధవ్, విష్ణువర్ధనరెడ్డి వంటివారిని ప్రధాన కార్యదర్శులను చేయడం, విష్ణు కుమార్ రాజును ఉపాధ్యక్షుడుగా నియమించడం వంటివి ఈ కోవలోకే వస్తాయి. హిందూత్వంపై నమ్మకంతోరాజకీయాలలో ప్రాబల్యం పెంచుకోవాలనే బిజెపి ఆశకు అంతర్వేది ఘటన తదితర అంశాలు కలసి వచ్చాయి. మొన్నటి ఎన్నికల్లో ఘోరంగా దెబ్బతిన్న జనసేనాని పవన్ కళ్యాణ్‌పై ఆధారపడటమే మెరుగని కూడా నిర్ణయించు కున్నారు, రాజకీయంగా టిడిపి స్థానాన్ని తాము పొందాలని బిజెపి ఆశపడుతుంటే బిజెపి కన్నా తామే హిందూత్వ పరిరక్షకులుగా కనిపించాలని టిడిపి తాపత్రేయపడటం ఎపిలో తాజా రాజకీయాలకు పరాకాష్టగా చూడాలి. జగన్ ప్రభుత్వ దాడుల కేసులతో ఉక్కిరిబిక్కిరవుతున్న టిడిపి అన్ని అంశాలపై విమర్శలు చేస్తూనే ఆయన క్రైస్తవానుబంధాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తోంది. గతంలో విఫలమైనా వదలిపెట్టని టిడిపి అవకాశం దొరికినప్పుడల్లా మత కోణం ప్రస్తావిస్తూనేవస్తున్నది. అమరావతిని అయోధ్య చేస్తామనడం, హిందూమహాసభ నేతలను జెఎసి నేతలుగా పెట్టుకోవడం ఇందులో భాగమే, అంతర్వేది ఘటన తర్వాత బిజెపిని మించి టిడిపి జనసేన దూకుడు పెంచాయి. హిందూత్వ అన్నది హిందూమతం కాదని బిజెపి విధానమని కూడా టిడిపి మరిచి పోయి ఆ మాటలనే మంత్రంలా ఉపయోగిస్తున్నాయి. ఇదొక పోటాపోటీ హిందూత్వంలా తయారైంది.ఆ పార్టీలకు దీనివల్ల కలిగే ప్రయోజనం ఎంత అనేది ఇప్పుడే చెప్పలేం. ఇప్పటికే కులచిచ్చు రగుతున్న ఏపిలో మతపరమైన ఉద్రిక్తతలు పెరగడం వాంఛనీయం మాత్రం కాదు.ప్రజాసమస్యలపై కేంద్రీకరించి కేంద్రం నుంచి నిధులు, హోదా వంటివి తేవడానికి ప్రయత్నిస్తే బిజెపికి లాభించేది. ఎన్నికల్లో టిడిపి ఘోరంగా దెబ్బతిని జగన్ ముఖ్యమంత్రి అయ్యాక, టిడిపి నేతలు వైకాపా బాట పట్టడం కూడా టిడిపికి కోలుకోలేకుండా పోయింది. రాజ్యసభలో ఆ పార్టీ సభ్యులు దాదాపుగా బిజెపిలో విలీనమై పోయారు. మాజీ మంత్రులు కూడా కొందరు చేరారు. ఇంత జరిగినా టిడిపి మాత్రం బిజెపిపై పాత విమర్శలు దిగమింగడమే గాక ప్రధాని మోడీని ప్రశంసించడం విధానంగా మార్చుకుంది. ప్రత్యర్థి పార్టీపై కేంద్ర ఏజన్సీలను పురికొలిపే మోడీ దూకుడు దృష్ట్యా జగన్‌పై కేసు విచారణ నేపథ్యంలో కేంద్రంతో ముఖాముఖి ఘర్షణ పెట్టుకోరాదన్నది వైసీపీ వ్యూహంగా కనిపిస్తోంది.

ఆరోగ్య సిబ్బందిపై దాడిచేసే వారిని శిక్షించే బిల్లుకు రాజ్యసభ ఆమోదం

ఢిల్లీ, సెప్టెంబర్ 19: ప్రస్తుత కోవిడ్-19 సంక్షోభం నేపథ్యంలో వైద్యరంగంలోని డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలపై దాడిచేసేవారిని శిక్షించే బిల్లుకు రాజ్యసభ శనివారం ఆమోదం తెలిపింది. ఈ చట్టం కింద దోషులకు ఐదేళ్ల వరకు శిక్షను విధించనున్నారు. గడిచిన ఏప్రిల్‌లో తీసుకువచ్చిన ఆర్డినెన్స్ స్థానంలో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ నేడు రాజ్యసభలో ఎపిడమిక్ డిసీజెస్ బిల్,2020ని ప్రవేశపెట్టారు. అంటువ్యాధుల సమయంలో హింసకు వ్యతిరేకంగా ఆరోగ్య సిబ్బంది జీవన, పని ప్రాంగణంతో సహా ఆస్తులను రక్షించడానికి ఎపిడెమిక్ డిసీజెస్ యాక్ట్, 1897ను సవరిస్తూ కేంద్ర క్యాబినెట్ ఎపిడెమిక్ డిసీజెస్ 2020 ఆర్డినెన్స్‌ను ప్రకటించింది.ప్రస్తుత మహమ్మారికి సమయంలో ఏ పరిస్థితులలోనైనా ఆరోగ్య సంరక్షణ సేవా సిబ్బందిపై హింసకు పాల్పడకుండా అదేవిధంగా ఆస్తికి నష్టం వాటిల్లకుండా చేసేందుకు బిల్లు రూపకల్పన జరిగింది.

భారీ వర్షాలకు ఆర్డీఎస్ కాల్వకు గండి

జలమయం అయిన గద్వాల పట్టణం

జోగులాంబగద్వాల,సెప్టెంబర్19 (ఆర్ఎన్ఎ): తెలంగాణతో పాటు పొరుగున ఉన్న కర్ణాటకలో భారీగా వర్షాలు

భారీ వర్షాలతో ఎగువ నుంచి నీరు చేరడంతో జలమయం అయిన గద్వాల పట్టణం

కురవడంతో వాగులు,వంకులు పొంగుతున్నాయి. ఈ భారీ వర్షాలకు వరదలు పోటెత్తడంతో.. అన్ని జలాశయాలు నీటితో కళకళలాడుతున్నాయి. జోగులాంబ గద్వాల జిల్లాలో శుక్రవారం రాత్రి వర్షం బీభత్సం సృష్టించింది. మానవపాడు మండల కేంద్ర సమీపంలో ఉన్న ఆర్డీఎస్ కాలువకు గండి పడింది. డీ30 వద్ద కాలువ తెగిపోవడంతో.. పంట పొలాల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. పంట పొలాలు నీట మునగడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తీవ్రంగా పంట నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక గద్వాల పట్టణం జలమయం అయింది. గుంట వీధి, నల్లకుంట, రాజవీధి, చిన్న అగ్రహారం, గంజిపేట, సుంకులమ్మ మెట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి వరద నీరు చేరింది. గద్వాలలో జలమయమైన ప్రాంతాలను టీఆర్ఎస్ ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి పరిశీలించారు. సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం ర

సింగూర్ ప్రాజెక్ట్‌కి జలకళ..!!

-ప్రాజెక్ట్‌ని సందర్శించిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు

సంగారెడ్డి ,సెప్టెంబర్ 19 (నేటినిజం ప్రతినిధి)సింగూర్ ప్రాజెక్టు సందర్శనకు పర్యాటకుల సందడి ఎక్కువగా ఉన్నందున

అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులు, పోలీసు సిబ్బందినీ ఆదేశించారు.

శుక్రవారం కలెక్టర్ పుల్కుల్ మండలం సింగూర్ ప్రాజెక్టు ను సందర్శించారు. ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతుండడంతో పర్యాటకుల సందడి మొదలైందని ప్రాజెక్టు డీ ఈ కలెక్టర్ కు తెలిపారు. ఇప్పటివరకు ఎంత నీరు వచ్చి చేరిం ది , ప్రాజెక్టు లో ప్రస్తుతం ఎన్ని టీఎంసీల నీటి నిల్వ ఉందని కలెక్టర్ అడగగా, ప్రాజెక్టులో నీటి నిల్వ 14 టీఎంసీలకు చేరిందని డీఈ తెలిపారు. చేరిన వరద నీటి తో సింగూర్ ప్రాజెక్టు కళకళలాడుతున్న దని కలెక్టర్ ఆనందం వ్యక్తం చేశారు.

వరద నీరు అధికంగా వస్తున్నందున పర్యాటకులను డ్యాం పైకి అనుమతించవద్దని తెలిపారు.

ప్రాజెక్టు అధికారులు, పోలీస్ సిబ్బంది అన్నివేళలా అప్రమత్తులై జాగ్రత్తగా ఉండాలన్నారు. పర్యాటకుల సందడి కి తగ్గట్టుగా అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు.

తుదిదశకు చేరుకున్న మిషన్ భగీరథ

పరిశుభ్రమైన తాగునీరు అందించమే లక్ష్యం మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ వెల్లడి

ఖమ్మం,సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ): ఇంటింటికీ తాగు నీరు అందించాలన్న లక్ష్యంతో ప్రారంభించిన మిషన్ భగీరథ పనులు ఖమ్మం జిల్లాలో వేగంగా జరుగుతున్నాయని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. ఆయా పనులు చివరిదశకు చేరుకున్నాయని విలేకరులతో తెలిపారు. అతి త్వరలో ఈ పనులుపూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తామన్నారు. ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించాలని ప్రభుత్వం రూ. 230 కోట్లరూపాయలతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు పనుల్లో తన అభ్యర్థన మేరకు పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ కోవిడ్ పరిస్థితుల్లోకూడా 61.47 కోట్ల రూపాయల బిల్లులను సంబంధించి చెక్కులను ఎల్అండ్ టి ప్రతినిధులకు అందజేశారని తెలిపారు. తెలంగాణలోని ప్రతి పల్లెలోనూ ప్రతి ఇంటికీ పరిశుభ్రమైన తాగునీరు అందించమే లక్ష్యంగా మిషన్ భగీరథ ప్రారంభించినట్టు తెలిపారు. దసరా నాటికి మంచినీరు సరఫరా చేస్తామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. పథకం కోసం ప్రభుత్వం రూ.230 కోట్లు కేటాయించిందన్నారు. ఖమ్మం నగరంలో ప్రస్తుతం ఉన్న నల్లా కనెక్షన్లతో పాటు కొత్తగా 45 వేల నల్లా కనెక్షన్లు ఇచ్చి ఇప్పటి వరకు 25 వేల ఇండ్లకు నల్లాలు బిగించామని, మొత్తం 75 వేల నల్లా కనెక్షన్ల ద్వారా ప్రతి ఇంటికి ప్రతిరోజు తాగునీటి సరఫరా జరుగుందని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. త్వరలో పనులు పూర్తి చేసి 75,000 నల్లా కనెక్షన్ల ద్వారా మంచినీరు సరఫరా చేస్తామన్నారు. మిషన్ భగీరథ పనులు ఇప్పటికే ముగింపు దశలో ఉన్నాయని నెలరోజుల వ్యవధిలో పనులన్నీ పూర్తి చేసి నగర ప్రజలకు ప్రతిరోజు తాగునీటిని అందిస్తామని మంత్రి తెలిపారు. పాత ఆస్తిపన్ను బకాయిలు, పెనాల్టీ వడ్డీలపై 90శాతం రాయితీ కాలపరిమితిని అక్టోబర్ 31 వరకు పొడిగించామని, నగర ప్రజలు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని మంత్రి అన్నారు. నగర పాలక, పురపాలక సంఘాల పరిధిలో గల శాసనసభ్యులందరూ ప్రజల విన్నపాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినందుకు గాను ఎల్ఆర్ఎస్ విధానంలో ఇది వరకు జారీ చేసిన ప్రభుత్వ మార్గదర్శకాలను సవరిస్తూ జి.ఓ. 135 ను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఎల్ఆర్ఎస్ స్కీంను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు

బిజెపి నేత బండి మాటలు ఆక్షేపణీయం

తెలంగాణలో అన్ని పథకాలతో ప్రజలకు మేలు: ఎర్రబెల్లి

వరంగల్ రూరల్,సెప్టెంబర్19 (ఆర్ఎన్ఎ): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ మాట్లాడే ప్రతి మాట అబద్దాల మూట అని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. సీఎం కేసిఆర్ ప్రజల సమస్యల్ని దూరదృష్టితో ఆలోచించి అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు ఆ పథకాలు అన్ని కేంద్రం ఇచ్చే నిధులతో నడుస్తున్నాయనడం విడ్డూరంగా ఉందన్నారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఎమ్మెల్యే ఆరూరి రమేష్ సభ అధ్యక్షతన వర్ధన్నపేట నియోజకవర్గ స్థాయి ఎన్నికల సన్నాహక సమావేశం శనివారం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ బిజెపి నేతలు అడ్డూఅదుపులేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. ప్రతి నెల వృద్దులకు ఇచ్చే ఒక్క ఆసరా పెన్షన్ల కే రాష్ట్ర ప్రభుత్వం 11000కోట్లు కేటాయిస్తే కేవలం కేంద్రం ఇచ్చేది 200 కోట్లు మాత్రమేనన్నారు 100రూపాయలలో 180 పైసలు మాత్రమే కేంద్రం ఇస్తుందన్నారు.ఇలా అబద్దాలు చెప్పి పబ్బం గడిపే కాంగ్రెస్ బీజేపీ లకు ఈ మధ్య జరిగే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీకి ఓటేసి ఆయా పార్టీలకు కర్రు కాల్చి వాత పెట్టాలన్నారు ఈ ఎన్నికలను టీఆర్ఎస్ యూత్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు. ఈ ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో కన్న అత్యధిక మెజార్టీ వర్ధన్నపేట నియోజకవర్గంలో తీసుకువచ్చి నా పేరు, ఆరూరి రమేష్ పేరును నిలబెట్టాలన్నారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు మౌలిక సదుపాయాల సంస్థ చైర్మెన్ గ్యాదరి బాలమల్లు, మేయర్ గుండా ప్రకాష్ రావు, ఎమ్మెల్యే అరూరి రమేష్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గిరిజనుల జీవన ప్రమాణాలు పెంచాలి : మంత్రి సత్యవతి

హైదరాబాద్ : ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకుని గిరిజనుల జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేయాలని గిరిజన సంక్షేమ శాఖ అధికారులను ఆ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ సూచించారు.

ఈ శాఖలో అమలవుతున్న పథకాలు లబ్దిదారులకు చేరవేయడం, గిరిజన విద్యాలయాలు పునఃప్రారంభంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు ఐటీడీఏలలో గిరిజన సమస్యల్ని పరిష్కరించే అంశాలపై మంత్రి సత్యవతి రాథోడ్ అధికారులతో చర్చించి మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సత్యవతి మాట్లాడుతూ.. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, పరిశ్రమలను ఉపయోగించుకుని గిరిజనుల జీవన ప్రమాణాలను పెంచాలన్నారు. కొవిడ్ సమయంలో ఆగిపోయిన పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. వికారాబాద్, మహబూబాబాద్ జిల్లాలకు పాడి పశువులను ఇవ్వడం ఒక పైలట్ ప్రాజెక్టుగా చేపడుతున్నామని తెలిపారు. పాడి పశువులను అర్హులైన లబ్దిదారులకు అందజేయాలని సూచించారు. ఎకానామిక్ సపోర్ట్ స్కీమ్స్ కింద ఇప్పటికే దాదాపు 500 మంది గిరిజన యువతకు ఓనర్ కమ్ డ్రైవర్ పథకంలో కార్లు ఇచ్చాము అని మంత్రి గుర్తు చేశారు. గిరిజన గ్రామాల్లో 3 ఫేజ్ కరెంట్ కోసం 117కోట్ల రూపాయలు కేటాయించాము అని తెలిపారు. కొవిడ్ నేపథ్యంలో ఏజెన్సీలో సరైన వసతులు లేని గిరిజన విద్యార్థుల వద్దకు వెళ్లి విద్యా బోధన చేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామని మంత్రి సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు.

ముగిసిన సుమేధ అంత్యక్రియలు

హైదరాబాద్,సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ): నగరంలోని నేరేడ్‌మెట్ ఠాణా పరిధిలో ఉన్న ఈస్ట్ దీనదయాళ్‌నగర్ ఓపెన్ ప్రమాదవశాత్తు నాలాలో పడి శుక్రవారం మృతి చెందిన పన్నెండేళ్ల చిన్నారి సుమేధ కపూరియా అంత్యక్రియలు శనివారం జరిగాయి. మల్కాజిగిరిలోని పటేల్ నగర్ స్మశాన వాటికలో దహన సంస్కారాలు పూర్తి అయ్యాయి. శుక్రవారం సరదాగా సైకిల్ తొక్కుదామని బయటికి వెళ్లిన బాలిక కనిపించకుండా పోయి దాదాపు పన్నెండు గంటల తరువాత నాలా నుంచి రెండు కిలోమీటర్ల దూరంలోని బండచెరువులో విగతజీవిగా లభించింది. జీహెచ్ఎంసీ నిర్లక్ష్యానికి అభంశుభం తెలియని చిన్నారి బలైపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కూతురు సుమేధ మృతి చెందడానికి పరోక్షంగా జీహెచ్ఎంసీ అధికారులే కారణమని ఆమె తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ అధికారులపై బాలిక తల్లిదండ్రులు నేరేడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నల్లగొండ జిల్లాలో 4,836 ఎకరాల్లో పంట నష్టం

నల్లగొండ,సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ): గత కొన్ని రోజులుగా నల్లగొండ జిల్లాలో ఏకధాటిగా కురుస్తున్న వర్షాల కారణంగా 4,836 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నీరు నిల్వ ఉండటం, ఇసుక మేటలు వేయడంతో తొమ్మిది మండలాల్లోని 44 గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయశాఖ విభాగం అంచనా ప్రకారం.. 321 మంది రైతులకు చెందిన 1,664 ఎకరాల్లో పత్తి, 3,172 ఎకరాల్లో వరి పంటలు దెబ్బతిన్నట్లుగా సమాచారం. ఈ వర్షాకాలంలో వానలు సకాలంలో కురియడం వల్ల అధికమొత్తంలో పత్తి, వరి దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు ఆశిస్తున్నారు.

కొనసాగుతున్న అమరావతి రైతుల ఆందోళన

బిజెపిపైనా సన్నగిల్లిన ఆశతో పోరాటం 277కు చేరుకున్నా కలసి రాని పార్టీలు

అమరావతి,సెప్టెంబర్19((ఆర్ఎన్ఎ): రాజధానిని తరలించవద్దంటూ రైతులు, మహిళలు చేపట్టిన నిరసనలు 277వ రోజు చేరుకున్నాయి. మందడం, తుళ్లూరు, వెలగపూడి, వెంకటపాలెం, కృష్ణాయపాలెం, ఎర్రబాలెం, ఐనవోలు, ఉద్దండరాయుని పాలెం, పెడపరిమి, దొండపాడు, నెలపాడు, ఆనంతవరం తదితర గ్రామాల్లోని శిబిరాల్లో రైతుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. రాజధానిగా అమరావతి కొనసాగుతుందని ప్రభుత్వం చెప్పే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని రాజధాని రైతులు స్పష్టం చేశారు. కరోనా సూచనలు పాటిస్తూ అమరావతి ఉద్యమం సాగుతోంది. కేంద్రంలో బిజెపి అధికారంలో ఉన్నందున రాజధాని తరలింపును బీజేపీ అడ్డుకుంటుందన్న గంపెడాశతో రాజధాని రైతులతోపాటు అమరావతే రాజధానిగా ఉండాలని అభిలషిస్తున్నవారంతా ఆశించారు. నిజానికి రాజధానిని ఎక్కడ పెట్టుకోవాలన్నది రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోనిదే. పునర్వ్యవస్థీకరణ బిల్లును ప్రతిపాదించిన అప్పటి ప్రభుత్వ పెద్దలు ఏ అధికారంతో రాజధానిని నిర్ణయించడానికి శివరామకృష్ణన్ కమిటీ వేశారో తెలియదు. అయితే రాజధానిగా అమరావతి కొనసాగాలని బీజేపీ రాష్ట్ర శాఖ తీర్మానించడంతోపాటు రైతుల ఆందోళనకు సంఘీభావం పలకడం వల్ల ఆ పార్టీ నాయకులపై ప్రజలు నమ్మకం పెంచుకున్నారు. కన్నా లక్ష్మీనారాయణ స్థానంలో సోము వీర్రాజును పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా బీజేపీ అధిష్ఠానం ఎంపిక చేసినా రాజధాని రైతులకు మాత్రం ఊరట దక్కలదే. ఆయన కూడా ఇక్కడ భూకుంభకోణాలు జరిగాయని భావిస్తున్నారు. దీనితో బీజేపీ తమను నమ్మించి మోసం చేసిందని రాజధాని రైతులు ఆక్రోశిస్తున్నారు. రైతుల ఆవేదనలో హేతుబద్ధత లేకపోలేదు. పలు అవినీతి కేసుల్లో విచారణ ఎదుర్కొంటున్న సిఎం జగన్ ని బీజేపీ అదుపులో పెడుతుందని అంతా భావించారు. రాజధాని తరలింపు ఆలోచనను విరమించుకోవాలని బీజేపీ పెద్దలు మౌఖికంగా ఆదేశించినా జగన్ శిరసావహించి ఉండేవారని బావిస్తున్నారు. కానీ అలా జరగలేదు అంటే వైసీపీకి, బీజేపీకి లోపాయికారీ అవగాహన ఉందన్న అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ప్రత్యేక హోదా ఇచ్చే విషయంలో కూడా బీజేపీ వంచించిందని భావిస్తున్న ప్రజలకు తాజా పరిణామాలు పుండు మీద కారం రాసినట్టయింది. ఎన్నికలకు ముందు ప్రత్యేక హోదా అని పలవరించిన జగన్ ముఖ్యమంత్రి అయ్యాక దానిని పక్కన పడేశారు. జగన్‌ను కట్టడి చేయగలిగిన బీజేపీ పెద్దలకు రాజధాని తరలింపును అడ్డుకోవడం కష్టం కాదు కదా? అని రైతులు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రాన్ని విభజించడం ద్వారా కాంగ్రెస్ అన్యాయం చేయగా, రాజధాని తరలింపును నిలువరించకపోవడం ద్వారా బీజేపీ మోసం చేసింది అని ప్రజలు భావిస్తున్నారు. అయితే ప్రజలు ఎలా అనుకున్నప్పటికీ రాష్ట్రంలో బీజేపీ కొత్తగా నష్టపోయేదేమీ లేదు. రాష్ట్రంలో అధికారంలో, ప్రతిపక్షంలో ఉన్న రెండు ప్రాంతీయ పార్టీలు తమ అదుపులో ఉండాలనే బీజేపీ పెద్దలు కోరుకుంటున్నారు. అందుకే దీనిపై పెద్దగా వారు స్పందించడం లేదు.

కరోనాకు ఎవరూ భయపడొద్దు

నియోజకవర్గ ప్రజలకు మంత్రి ఎర్రబెల్లి భరోసా

జనగామ టిఆర్ఎస్ కార్యాలయ పనుల పరిశీలన

జనగామ,సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ): ప్రపంచాన్ని పట్టిపీడిస్తోన్న కరోనా మహమ్మారికి ఎవరూ భయపడొద్దని.. భద్రంగా ఉండాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు భరోసానిచ్చారు. పాలకుర్తి నియోజకవర్గంలోని కరోనా బాధితులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో శనివారం ఎర్రబెల్లి దయాకర్ రావు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కరోనా బాధితుల్లో మనోధైర్యం నింపేందుకు ప్రతి రోజు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో.. కరోనా బాధితులకు అండగా ఉండాలని చెప్పారు. సీఎం కేసీఆర్ సూచనల మేరకు వైద్యారోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ కరోనా నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కిస్తున్నారని తెలిపారు. గోరువెచ్చిన నీటిని తాగుతూ.. వేడి పదార్థాలను తీసుకోవడం మంచిదని సూచించారు

. కరోనా బాధితులను ప్రజాప్రతినిధులు ఆదుకోవాలని, తన సొంత ఖర్చులతో మాస్కులు పంపిణీ చేస్తున్నామని మంత్రి తెలిపారు. కరోనా బారిన పడ్డ వారి కోసం ప్రత్యేక అంబులెన్స్‌లను సిద్ధం చేశామన్నారు. వరంగల్ ఎంజీఎంలో కరోనా బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. ఇదిలావుంటే తెలంగాణలోని ప్రతి జిల్లాలో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని టీఆర్ఎస్ పార్టీ నిర్ణయించిన విషయం విదితమే. ఈ క్రమంలో ఆయా జిల్లాల్లో పార్టీ కార్యాలయాల నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. దాదాపు అన్ని జిల్లాల్లో పార్టీ కార్యాలయ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నారు. త్వరలోనే పార్టీ కార్యాలయాలను ప్రారంభించే అవకాశం ఉంది. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి కలిసి.. జనగామ టీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని శనివారం ఉదయం సందర్శించారు. నిర్మాణ పనులను పరిశీలించి.. కాంట్రాక్టర్‌కు తగు సూచనలు చేశారు. ఈ కార్యాలయం ప్రారంభానికి సిద్ధంగా ఉందని మంత్రి ఎర్రబెల్లి స్పష్టం చేశారు. త్వరలోనే సీఎం కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా కార్యాలయాన్ని ప్రారంభిస్తామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో నిర్మిస్తున్న ఐదు కార్యాలయాలు త్వరలోనే అందుబాటులోకి వస్తాయని తెలిపారు. పార్టీ కార్యాలయాలు ప్రారంభమైతే పార్టీ కార్యకలాపాలన్నీ అందులోనే జరుపుకునే వీలు కలుగుతుందన్నారు. పార్టీ శ్రేణులకు కూడా అనుకూలంగా ఉంటుందన్నారు. పార్టీ కార్యాలయాలు సర్వాంగ సుందరంగా సకల సదుపాయాలతో నిర్మిస్తున్నట్లు మంత్రి ఎర్రబెల్లి తెలిపారు.

పూర్తి కావచ్చిన జనగామ టిఆర్ఎస్ కార్యాలయ పనులను పరిశీలించిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్రావు

ఫిర్యాదు ధారులకు పారదర్శక సేవలను అందించాలి

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ రాహుల్ హెగ్డే

వేములవాడ, సెప్టెంబర్ 19 (నేటినిజం ప్రతినిధి):పోలీస్ స్టేషన్ లో ఉన్న రికార్డులను ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తూ, సమస్యల పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్ కు వచ్చే వారికి పోలీస్ సిబ్బంది పారదర్శకంగా సేవలు అందించాలని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశించారు.

శనివారం జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ లో సీసీ టి ఎన్ ఎస్ రైటర్స్ గా పని చేసే వారు ఫైల్స్ ను అప్లోడ్ చేసేటప్పుడు పార్ట్-1, పార్ట్-2 , క్రైమ్ సీన్, మ్యాప్, ఇతర ఫోటోలు తప్పకుండా అప్లోడ్ చేయాలని, ఒక సారి స్టేషన్ కు పిర్యాదు వచ్చాకా పిటిషన్ ఎంట్రీ, తదుపరి చర్యలు, విచారణ, ఇలా ప్రతి చర్యను సీసీ ఎన్ ఎస్ లో అప్లోడ్ చేయాలని రైటర్ కు సూచించారు.

స్టేషన్ యొక్క పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అందుకోసం 5ఎస్ ను క్రమం తప్పకుండా అమలు చేయాలని, రాత్రి వేళల్లో బ్లూ కోల్ట్స్, బీట్ సిబ్బంది ప్రతి గ్రామాన్ని సందర్శించాలని, రాత్రి వేళల్లో జరిగే నేరాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, నేరాల నియంత్రణ కు సీసీ కెమెరాలు ప్రముఖ పాత్ర వహిస్తాయని గ్రామాలలో సీసీ కెమెరాల స్థాపనకు ప్రజలను ప్రోత్సహించాలని కోరారు. కంప్యూటర్ పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, గ్రామాలలో తరచుగా గొడవలకు కారణం అవుతున్న వారి పై రౌడీ షీట్ నమోదుకు రిపోర్ట్ పంపించాలని, తరచుగా గొడవలు జరుగుతున్న గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు.

ప్రతి గ్రామంలో లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అందుకు అనుగున్నంగా ప్రజలకి వాటి ద్వారా కలిగే ప్రయోజనాలని అవగాహన కల్పించాలన్నారు.ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలన్నారు.భూవిషయాల్లో జోక్యం చేసుకోవద్దని అదేశిస్తూ కోర్ట్ ల ద్వారా సమస్యలని పరిష్కరం చేసుకునే విధంగా ప్రజలకి సూచించాలన్నారు.నిషేధిత పొగాకు విక్రయాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అసంగీక కార్యకలాపాలపై పోలీస్ లకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల కోసమే పోలీసులు పని చేస్తున్నారని చెప్పారు. డయల్100 కి కాల్ చేసిన నిమిషాల వ్యవధిలో సహాయం అందుతుంది అని చెప్పారు. ధైర్యంకోల్పోకుండా మీరు ఉన్న లొకేషన్ పంపాలని డయల్100 24×7 అందుబాటులో ఉంటుంది అని చెప్పారు. బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్ వాహనాలను పనితీరును ఎప్పటికపుడు సమీక్షించాలన్నారు.

సోషల్ మీడియా కాంప్లెట్ సెల్‌వాట్స్‌అప్ 6303 922 572 ఫేస్ బుక్, ట్విట్టర్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీని ద్వారా కూడా కంప్లెంట్ ఇవ్వచ్చు అని దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ టౌన్ సి.ఐ వెంకటేష్, ఎస్.ఐ లు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు అనుకూలంగా నూతన వ్యవసాయ బిల్లు

భారతీయ కిసాన్ సంఘం ఆగ్రహం

న్యూఢిల్లీ,సెప్టెంబర్19(ఆర్ఎన్ఎ): వ్యవసాయ రంగానికి సంబంధించిన మూడు కీలక బిల్లులకు లోక్‌సభ ఆమోదం తెలుప డంతో.. దేశ వ్యాప్తంగా రైతులు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఆర్ఎస్ఎస్ అనుబంధ రైతు సంఘం భారతీయ కిసాన్ సంఘం (బీకేఎస్) ఈ బిల్లులపై తీవ్ర ఆగ్రహం వెలిబు చ్చింది. కార్పొరేట్లకు పట్టం కట్టి.. రైతులకు అన్యాయం చేస్తున్నారని బీకేఎస్ జనరల్ సెక్రటరీ బద్రి నారాయణ్ చౌదరి మండిప డ్డారు. వ్యవసాయ మార్కెట్ల సంస్కరణ, పంటల ఒప్పంద నిబంధనల బిల్లు, నిత్యావసర సరుకుల (సవరణ) -2020 బిల్లులు ఆమోదం పొందడంతో రైతులకు క్లిష్టతరమైన పరిస్థితులు ఎదురవుతాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాము రైతుల పక్షాన కేంద్రానికి వ్యతిరేకంగా పోరాడుతామన్నారు. కనీస మద్దతు ధరను కూడా రైతులు కోల్పోవాల్సి వస్తుందన్నారు. చిన్న, సన్నకారు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. రైతుల బాధలు కేంద్రానికి పట్టకపోవడం చాలా దురదృష్టకరమని చౌదరి పేర్కొన్నారు. ఈ బిల్లులను వ్యతిరేకిస్తూ ప్రధాని మోదీకి ఇప్పటికే 50 వేల మంది రైతులు లేఖలు రాశారని గుర్తు చేశారు. అగ్రి బిల్లులను బీకేఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చౌదరి స్పష్టం చేశారు.

వ్యవసాయ బిల్లుతో రైతులకు తీవ్ర అన్యాయం : ఎంపీ నామా

న్యూఢిల్లీ, సెప్టెంబ ర్ 19: దేశవ్యాప్తంగా రైతాంగం దెబ్బతినేలా ఆర్డినెన్సులు తెచ్చారని టీఆర్ఎస్ ఎంపీ నామా నాగేశ్వర్ రావు అన్నారు. లోక్‌సభలో మెజార్టీ ఉందని బిల్లులు పాస్ చేశారని మండిపడ్డారు.'బడా కంపెనీలకు మేలు జరిగేలా కొత్త వ్యవసాయ చట్టాలు తీసుకొచ్చారు. పెద్ద కంపెనీలకు ప్రభుత్వ భూములను అప్పగించేందుకే కొత్త బిల్లులను కేంద్రం తీసుకొస్తోంది. రైతాంగానికి నష్టం చేకూర్చేలా ఉన్న బిల్లులను రాజ్యసభలో అడ్డుకుంటాం. రైతుల సంక్షేమానికి వ్యతిరేకంగా, రైతులపై కేంద్రం కక్షసాధింపు చర్యలు తగదు. రాజ్యసభలో వాటిని వ్యతిరేకించి అడ్డుకుంటాం. ఈ బిల్లులతో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. విదేశీ రైతులకు మేలు చేసేలా దిగుమతి సుంకం తగ్గించారని' నామా మండిపడ్డారు.

జిల్లా ఖ్యాతిని రాష్ట్రానికి చాటి చెప్పాలి

మకారంద్‌ను అభినందించిన జిల్లా ఎస్పీ రాహుల్

వేములవాడ, సెప్టెంబర్ 19 (నేటినిజం ప్రతినిధి):రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం మాల్లారెడ్డి పేట గ్రామానికి చెందిన ఇటీవల వెలువడిన ఆలిండియా సివిల్ సర్వీస్ సర్వీస్ లో 110 ర్యాంకువచ్చిన మంద.మకారంద్ శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ మర్యాదపూర్వకంగా కలవగా ఆయన సివిల్ సర్వీస్ లో సెలెక్ట్ అయినందుకు శాలువా కప్పి అభినందించి, మెమోంటోను అందజేశారూ.

ఈ సందర్భంగా ఆయనను ఎస్పీ ఎలా ప్రిపేర్ అయ్యావు ఇంటర్వ్యూ ఎలా జరిగింది అని అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఖ్యాతిని తెలంగాణ మొత్తం తెలియజేసినందుకు మరొక్కసారి అభినందించారు. మకారంద్ ను ఆదర్శంగా తీసుకుని అందరూ పట్టుదల, కృషి, కష్టపడే తత్వం, ఇష్టపడి చదివి ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడాలని ఆకాంక్షించారు.

అపోలో డయాగ్నస్టిక్ సెంటర్‌ను ప్రారంభించిన జిల్లా ఎస్పీ

వేములవాడ, సెప్టెంబర్ 19 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్ స్టాప్ రహదారిలో అపోలో నూతనంగా ఏర్పాటు చేసిన డయాగ్నోస్టిక్ సెంటర్ ను శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్గే ప్రారంభించారు అనంతరం నిర్వాహకులు ముప్పిడి శ్రీధర్ ఉప్పు రమేష్ ఎస్పీని ఘనంగా సన్మానించి సత్కరించారు .ఈ కార్యక్రమంలో అపోలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.